www.udyamakeratam.com

RNI: TGTEL/25/A0273

1వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షితః

UDYAMA KERATAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | | సంపుటి: 2 | | సంచిక: 58 | | 7-8-2026 | | శుక్రవారం | | పేజీలు: 8 | | వెల : రూ.2/- |


## విద్య వ్యాపారంగా మారింది



- నిరుద్యోగం, విద్య, ప్రజాస్వామ్య వ్యవస్థలపై ఉద్యమం : అభిజీత్ దీప్కే
- ప్రెజర్ గ్రూపుగానే కొనసాగుతాం.. ఎన్నికల్లో పోటీ చేసే ఆలోచన లేదు
- 'క్యా బోల్తీ పబ్లిక్' పేరుతో దేశవ్యాప్త ప్రచారానికి శ్రీకారం

4

## అగ్ని-4 క్షిపణి పరీక్ష సక్సెస్




- ఒడిశాలోని చాందీపూర్ నుంచి ప్రయోగం విజయవంతం
- 4,000 కి.మీ. దూరంలోని లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం

4

## తెహల్కా మాజీ ఎడిటర్‌కు 10 ఏళ్ల జైలు



- లైంగిక దాడి కేసులో హైకోర్టు సంచలన తీర్పు

4



# ఒకే వ్యవస్థలో రోడ్ల నిర్వహణ

- హైదరాబాద్ రోడ్ నెట్‌వర్క్‌పై సీఎం కీలక ఆదేశాలు
- డిసెంబర్ 9లోగా తొలి రేడియల్ రోడ్ పూర్తి చేయాలని నిర్దేశం
- భూసేకరణ వేగవంతం.. నాణ్యతలో రాజీ లేదన్న సీఎం రేవంత్

2

రాష్ట్రంలో ప్రజల రవాణా సౌకర్యాలను మరింత మెరుగుపరచడానికి రోడ్ నెట్‌వర్క్‌కు సంబంధించిన అన్ని పనులను ఒకే వ్యవస్థ పరిధిలోకి తీసుకురావాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్, హెచ్ఎండీఏ పరిధిలో కీలకమైన రోడ్ నెట్‌వర్క్ విస్తరణ, ప్రస్తుతం జరుగుతున్న వివిధ ప్రాజెక్టుల పురోగతిపై ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని 'బోధి పెవిలియన్'లో హెచ్ఎండీఏ, హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఉన్నతాధికారులతో సీఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. రోడ్ల నిర్మాణానికి అత్యంత ప్రధానమైన భూసేకరణ, రుణ సేకరణ, నిర్వహణ వంటి అంశాలతో పాటు ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు, నగర పరిధిలోని ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు, ఇతర రోడ్లన్నింటినీ సమగ్రంగా ఒకే వ్యవస్థ కిందికి తీసుకురావాలని సీఎం సూచించారు. ఔటర్ రింగ్ రోడ్డు నిర్వహణ సరిగా లేకపోవడం, దానిపై ఎక్కడికక్కడ వాహనాలను నిలపడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

*- హైదరాబాద్, ఆగస్టు 6*

## ప్రొఫె'సర్'కు సీఎం నివాళి

- ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సేవలు చిరస్మరణీయం
- ఆశయాల సాధనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్న రేవంత్



2

## కొత్త తెల్ల రేషన్ కార్డులకు ముహూర్తం ఖరారు

- ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ
- 1.05 కోట్ల ల్యామినేటెడ్ కార్డులు అర్హులకు
- సంగారెడ్డిలో సీఎం రేవంత్ చేతుల మీదుగా ప్రారంభం



తెలంగాణలో కొత్త తెల్ల రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. స్వాతంత్ర్య దినోత్సవమైన ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఆహార భద్రతను విస్తరించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.

2

## తరగతి గదిలో పాముకాటు



- మూడో తరగతి విద్యార్థి మృతి
- పాఠశాలలోనే విషాదం..
- చికిత్స పొందుతూ చిన్నారి కన్నుమూత
- భద్రతా లోపాలపై ఆవేదన వ్యక్తం చేసిన తల్లిదండ్రులు

2

## బోనాల వేళ ఆకతాయిల ఆటకట్టు

### షీటీమ్స్ ప్రత్యేక నిఘా

- 678 మంది ఈవ్‌టీజర్ల గుర్తింపు
- 25 మందికి జైలు..
- పలువురికి జరిమానాలు
- సామాజిక సేవ శిక్షలు

2

బోనాల ఉత్సవాల సందర్భంగా మహిళల భద్రత కోసం రంగంలోకి దిగిన షీటీమ్స్ ఆకతాయిల ఆటకట్టించాయి. ఉత్సవాల వేళ వివిధ దేవాలయాల వద్ద మహిళలను వేధింపులకు గురిచేసిన 678 మంది ఈవ్‌టీజర్లను షీటీమ్స్ ప్రత్యేక నిఘాతో గుర్తించాయి. బాధితుల ఫిర్యాదుల ఆధారంగా నిఘా పెంచిన పోలీసులు, సీసీటీవీ ఫుటేజీలు, వీడియో ఆధారాల సాయంతో నిందితులను పట్టుకుని కేసులు నమోదు చేశారు.




# స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష



- తెలంగాణ కోసం చివరి శ్వాస వరకు తపించిన జయశంకర్
- కేసీఆర్ పట్టుదలపై సంపూర్ణ విశ్వాసంతో వెన్నంటి నిలిచారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- జయంతి సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఘన నివాళులు

3

కాంగ్రెస్ పాలనలో తెలంగాణకు నీటి విషయంలో మళ్లీ అన్యాయం జరుగుతోందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి చెందిన 7 ప్రాజెక్టులను రద్దు చేయాలని పొరుగు రాష్ట్రం ఏపీ విజ్ఞప్తి చేస్తున్నా ప్రస్తుత ప్రభుత్వం సరైన రీతిలో స్పందించడం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి ఇప్పటివరకు అనేకసార్లు ఢిల్లీ పర్యటనలకు వెళ్లారని, స్వీయ రాజకీయాస్తిత్వాన్ని విడిచిపెట్టి ఢిల్లీ ముందు యాచించే పరిస్థితి తెచ్చారని మండిపడ్డారు. తెలంగాణ ప్రయోజనాల కోసం కాంప్రమైజ్ కాకుండా గర్జించే నాయకత్వమే శ్రీరామరక్ష అని, అందుకే కాంగ్రెస్‌లో విలీనం కావొద్దని ఆనాడు జయశంకర్ సార్ స్పష్టంగా చెప్పారని కేటీఆర్ పేర్కొన్నారు.

## సింగరేణి చరిత్రలో స్వర్ణాధ్యాయం

- ఒడిశా నైనీ గని నుంచి తొలిసారి తెలంగాణకు బొగ్గు
- జైపూర్ థర్మల్ కేంద్రానికి చేరిన 4 వేల టన్నుల జీ-10 గ్రేడ్ బొగ్గు
- విద్యుత్ రంగానికి కొత్త ఊపు.. చారిత్రక ఘట్టమన్న భట్టి విక్రమార్క

2



## గోదావరి ప్రాజెక్టులకు సమాధి కట్టే కుట్ర

- ఏపీ డైరెక్షన్‌లో జీఆర్ఎంబీ నడుస్తోంది
- 'జై తెలంగాణ' అనని వ్యక్తి సీఎంగా ఉన్నారు
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు

3

## ఆగస్టు 15 నుంచే కొత్త ఆసరా పింఛన్లు

- అర్హులందరికీ పింఛన్ అందిస్తాం: మంత్రి పొంగులేటి
- భూ భారతి ద్వారా డిజిటల్ హక్కు పత్రాలు
- పేదలకు ఎలాంటి అన్యాయం జరగనివ్వమని హామీ

2




# బోనాల వేళ ఆకతాయిల ఆటకట్టు

**షీటీమ్స్ ప్రత్యేక నిఘా.. 678 మంది ఈవ్‌టీజర్ల గుర్తింపు**

**25 మందికి జైలు.. పలువురికి జరిమానాలు, సామాజిక సేవ శిక్షలు**

**హైదరాబాద్, ఆగస్టు 6:** బోనాల ఉత్సవాల సందర్భంగా మహిళల భద్రతకు భంగం కలిగించే ఆకతాయిలపై షీటీమ్స్ ఉక్కుపాదం మోపాయి. దేవాలయాల వద్ద మహిళలను వేధింపులకు గురిచేసిన ఘటనలపై ప్రత్యేక నిఘా చేపట్టి మొత్తం 678 మంది ఈవ్‌టీజర్లను గుర్తించాయి. మహిళల నుంచి అందిన ఫిర్యాదులు, సీసీటీవీ దృశ్యాలు, వీడియో ఆధారాల సహాయంతో నిందితులను గుర్తించిన షీటీమ్స్, వారిపై కేసులు నమోదు చేశాయి. విచారణ అనంతరం నిందితులను కోర్టులో హాజరుపరచగా పలువురికి శిక్షలు విధించారు. న్యాయస్థానం 25 మందికి జైలు శిక్షతో పాటు జరిమానా, మరో 11 మందికి మూడు రోజుల జైలు శిక్షతో పాటు రూ.1,050 జరిమానా విధించింది. అదనంగా 26 మందికి రూ.1,050 చొప్పున జరిమానా విధిస్తూ సామాజిక సేవ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, వేధింపులకు పాల్పడడం వంటి చర్యలను ఏమాత్రం సహించబోమని పోలీసులు స్పష్టం చేశారు. మహిళల భద్రతకు భంగం కలిగించే వారిపై భవిష్యత్తులోనూ కఠిన చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.

# తరగతి గదిలో పాముకాటు

**మూడో తరగతి విద్యార్థి మృతి.. పాఠశాలలోనే విషాదం..**

**భద్రతా లోపాలపై ఆవేదన వ్యక్తం చేసిన తల్లిదండ్రులు**



**నారాయణపేట, ఆగస్టు 6:** నారాయణపేట జిల్లాలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో విషాద ఘటన చోటుచేసుకుంది. తరగతి గదిలో చదువుకుంటున్న ఎనిమిదేళ్ల విద్యార్థిని పాము కాటేయడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన నారాయణపేట మండలం ఎక్లాస్‌పూర్ గ్రామంలో జరిగింది. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న పిచ్చికుంట్ల రంజిత్ (8) బుధవారం తరగతి గదిలో ఉండగా ఒక్కసారిగా పాము కాటుకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు, గ్రామస్థులు వెంటనే బాలుడిని నారాయణపేట జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అత్యవసర చికిత్స అందించినప్పటికీ, పరిస్థితి విషమించడంతో రంజిత్ ప్రాణాలు కోల్పోయాడు. చిన్నారి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పాఠశాల ఆవరణలో పారిశుద్ధ్య లోపాలు, పొదలు, చెత్త పేరుకుపోవడం వల్లే పాములు సంచరిస్తున్నాయని తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పాములు, విషపురుగులు ప్రవేశించకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఇకపై ఇలాంటి విషాదాలు పునరావృతం కాకుండా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టం చేయాలని కోరుతున్నారు.

# ఉమెన్ సేఫ్టీ వింగ్ కస్టడీలో ఉదయ్ కృష్ణారెడ్డి

**ట్రైనీ ఐపీఎస్‌ను ప్రశ్నిస్తున్న పోలీసులు**

**నేటితో ముగియనున్న పోలీస్ కస్టడీ**



**హైదరాబాద్, ఆగస్ట్ 6:** ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిని ఉమెన్ సేఫ్టీ వింగ్ అధికారులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఐదున్నర గంటల వరకు కస్టడీ కొనసాగనుంది. అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఉమెన్ సేఫ్టీ డీసీపీ లావణ్య నాయక్ ఆధ్వర్యంలో విచారణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో డీసీపీ .. అత్తాపూర్ పీఎస్‌కు చేరుకున్నారు. కృష్ణారెడ్డిని డీసీపీ పర్యవేక్షణలో సీఐ జ్యోత్స్న విచారిస్తున్నారు. కస్టడీలో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. విచారణలో కీలక ఆధారాలు సేకరించే దిశగా పోలీసులు దృష్టి సారించారు. ప్రధానంగా మిస్సైన మొబైల్ ఫోన్‌పై పోలీసులు ఫోకస్ పెట్టారు. ఉదయ్ కృష్ణారెడ్డి రెండో మొబైల్ పైన ఆరా తీస్తున్నారు. మిస్సైన రెండో మొబైల్ దొరికినట్లయితే మరికొన్ని కీలక అంశాలు బయటపడే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ఉదయ్‌కు సంబంధించిన ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్‌ను పోలీసులు సీజ్ చేసి ఎఫ్ఎస్ఎల్‌కు పంపించారు. హైదరాబాద్‌లోని జాతీయ పోలీస్ అకాడమీలో మహిళా ట్రైనీ ఐపీఎస్‌పై లైంగిక వేధింపుల కేసులో ఉదయ్ కృష్ణారెడ్డిని గత నెల 28న పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలంటూ ఉమెన్స్ సేఫ్టీ వింగ్ అధికారులు ఉప్పరపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. రెండు రోజుల పాటు కస్టడీకి న్యాయస్థానం అనుమతిచ్చింది. ఈ నేపథ్యంలోనే ఉదయ్ కృష్ణారెడ్డిని కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు. మహిళా ట్రైనీ ఐపీఎస్‌తో పరిచయం, లైంగిక వేధింపులు, తదితర అంశాలపై పోలీసుల విచారణ కొనసాగనుంది.

# ఒకే వ్యవస్థలో రోడ్ల నిర్వహణ

**హైదరాబాద్ రోడ్ నెట్‌వర్క్‌పై సీఎం కీలక ఆదేశాలు**

- డిసెంబర్ 9లోగా తొలి రేడియల్ రోడ్ పూర్తి చేయాలని నిర్దేశం
- భూసేకరణ వేగవంతం.. నాణ్యతలో రాజీ లేదన్న సీఎం



**హైదరాబాద్, ఆగస్టు 6:** ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు హైదరాబాద్, హెచ్ఎండీఏ పరిధిలోని రోడ్ల నిర్మాణం, నిర్వహణ, విస్తరణకు సంబంధించిన అన్ని పనులను ఒకే వ్యవస్థ పరిధిలోకి తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో హెచ్ఎండీఏ, హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన కీలక సూచనలు చేశారు. ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్‌రోడ్, నగరంలోని ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, ప్రధాన రహదారుల నిర్మాణం, భూసేకరణ, రుణాల సమీకరణ, నిర్వహణ వంటి అన్ని అంశాలను సమన్వయంతో నిర్వహించేలా ఒకే వ్యవస్థను ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ఔటర్ రింగ్ రోడ్ నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు పెరుగుతున్నాయని పేర్కొంటూ, రహదారిపై ఎక్కడికక్కడ వాహనాలు నిలిపివేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులను ఆదేశించారు. రేడియల్ రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, కొంగరకలాన్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు నిర్మిస్తున్న రేడియల్ రోడ్-1ను డిసెంబర్ 9 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టాలని స్పష్టం చేశారు. నిర్మాణంలో ఎదురయ్యే అడ్డంకులను వెంటనే తొలగించాలని, పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని పేర్కొన్నారు. రోడ్లకు ఇరువైపులా విస్తృతంగా హరితవనం అభివృద్ధి చేయాలని, బుద్వేల్ ట్రంపెట్ ఇంటర్‌చేంజ్ నిర్మాణం, బంజారాహిల్స్ నుంచి శిల్పా లేఅవుట్ వరకు ప్రతిపాదించిన ఎలివేటెడ్ కారిడార్ పనులను త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. హైదరాబాద్ భవిష్యత్ అభివృద్ధి రోడ్ల విస్తరణపై ఆధారపడి ఉందని పేర్కొన్న సీఎం, భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఈ విషయంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని స్పష్టం చేశారు. ల్యాండ్ పూలింగ్ ప్రక్రియలో మధ్యవర్తుల జోక్యానికి అవకాశం ఉండకూడదని, టీడీఆర్‌ల జారీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

## ప్రొఫె'సర్'కు నివాళి


- ప్రొఫెసర్ జయశంకర్ సేవలు చిరస్మరణీయం

**హైదరాబాద్, ఆగస్టు 6:** తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఘన నివాళులర్పించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించిన ముఖ్యమంత్రి, తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమానికి ప్రొఫెసర్ జయశంకర్ సిద్ధాంత బలాన్ని అందించిన మహనీయుడని కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ సాధన కోసం జీవితాంతం అహర్నిశలు శ్రమించిన గొప్ప మేధావిగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ చూపిన మార్గంలో ముందుకు సాగుతూ, ఆయన ఆశయాల సాధనకు ప్రజా ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధి, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమమే జయశంకర్ ఆశయాలకు నిజమైన నివాళిగా నిలుస్తాయని పేర్కొన్నారు.

# సింగరేణి చరిత్రలో స్వర్ణాధ్యాయం

- ఒడిశా నైనీ గని నుంచి తొలిసారి తెలంగాణకు బొగ్గు
- జైపూర్ థర్మల్ కేంద్రానికి చేరిన 4 వేల టన్నుల జీ-10 గ్రేడ్ బొగ్గు
- విద్యుత్ రంగానికి కొత్త ఊపు.. చారిత్రక ఘట్టమన్న భట్టి విక్రమార్క

**మంచిర్యాల, ఆగస్టు 6:** సింగరేణి చరిత్రలో మరో కీలక మైలురాయి నమోదైంది. ఒడిశాలోని నైనీ బొగ్గు గని నుంచి ఉత్పత్తి చేసిన తొలి బొగ్గు రైలు తెలంగాణలోని మంచిర్యాల జిల్లా జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌కు చేరుకుంది. 136 ఏళ్ల సింగరేణి చరిత్రలో రాష్ట్రం వెలుపల ఉన్న సొంత గని నుంచి బొగ్గు ఉత్పత్తి చేసి, తెలంగాణలోని విద్యుత్ కేంద్రానికి తరలించడం ఇదే తొలిసారి కావడం విశేషం. 59 రైల్వే వ్యాగన్లలో సుమారు 4 వేల టన్నుల జీ-10 గ్రేడ్ నాణ్యమైన బొగ్గు జైపూర్ థర్మల్ కేంద్రానికి చేరుకోగా, సింగరేణి అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ చారిత్రక ఘట్టంపై ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేస్తూ సింగరేణి యాజమాన్యం, కార్మికులకు అభినందనలు తెలిపారు.



తెలంగాణలో విద్యుత్ కొరత లేకుండా ప్రభుత్వం సమగ్ర చర్యలు తీసుకుంటోందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. నైనీ గని నుంచి బొగ్గు రాకతో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌కు ఇంధన సరఫరా మరింత బలోపేతమవుతుందని, భవిష్యత్తులో కొత్త బొగ్గు గనుల సాధనకు కూడా ప్రయత్నాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. నైనీ బొగ్గు గని అభివృద్ధి కోసం అనుమతుల సాధనలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపిందని అధికారులు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్వయంగా రెండుసార్లు ఒడిశా వెళ్లి అక్కడి ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులతో చర్చలు జరపడంతో అనుమతుల ప్రక్రియ వేగవంతమైందని వెల్లడించారు. 2025 ఏప్రిల్ 16న నైనీ గనిలో బొగ్గు ఉత్పత్తిని వర్చువల్‌గా ప్రారంభించిన అనంతరం, అక్కడి నుంచి బయలుదేరిన తొలి రైలు 1,131 కిలోమీటర్లు ప్రయాణించి తెలంగాణకు చేరుకుంది. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ 2015లో సింగరేణికి కేటాయించిన నైనీ గనిలో 340.78 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు అంచనా. ఈ గని జీవితకాలం 36 సంవత్సరాలు కాగా, సంవత్సరానికి కోటి టన్నుల బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉంది. నాణ్యమైన బొగ్గు అందుబాటులోకి రావడంతో సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి ఇంధన భద్రత మరింత బలోపేతం కానుందని, రాష్ట్రంలో నిరంతర విద్యుత్ సరఫరాకు ఇది కీలక మద్దతు అందించనుందని ప్రభుత్వం భావిస్తోంది. సింగరేణి కీర్తి కిరీటంలో నైనీ గని మరో చారిత్రక అధ్యాయంగా నిలిచిపోతుందని అధికారులు పేర్కొన్నారు.

# ఆగస్టు 15 నుంచే కొత్త ఆసరా పింఛన్లు

**అర్హులందరికీ పింఛన్ అందిస్తాం: మంత్రి పొంగులేటి**

**త్వరలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు.. భూ భారతి ద్వారా డిజిటల్ హక్కు పత్రాలు**

**పేదలకు ఎలాంటి అన్యాయం జరగనివ్వమని హామీ**

**ఖమ్మం, ఆగస్టు 6:** స్వాతంత్ర్య దినోత్సవమైన ఆగస్టు 15 నుంచి కొత్తగా దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆసరా పింఛన్ల పంపిణీ ప్రారంభిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ గుదిమళ్లలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ఏ ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు దూరం కాకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు, వితంతువులు, నేత కార్మికులు, కల్లు గీత కార్మికులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, ఎయిడ్స్ బాధితులకు నెలకు రూ.2,016 చొప్పున, దివ్యాంగులు, తీవ్రమైన శారీరక వైకల్యం ఉన్న వారికి రూ.4,016 చొప్పున ఆసరా పింఛన్ అందజేస్తోందని మంత్రి తెలిపారు. ఫైలేరియా బాధితులకు కూడా నెలకు రూ.2,016 ఆర్థిక సాయం అందిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర భూ సర్వే చేపట్టి 'భూ భారతి' కార్యక్రమం ద్వారా డిజిటల్ మ్యాప్‌తో కూడిన భూమి హక్కు పత్రాలను లబ్ధిదారులకు అందజేస్తామని మంత్రి వెల్లడించారు. అనర్హుల పేర్లపై ఉన్న పట్టాదారు పాస్‌పుస్తకాలను రద్దు చేసి, నిజమైన హక్కుదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను మరో రెండు మూడు రోజుల్లో ప్రారంభిస్తామని వెల్లడించిన మంత్రి, అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే రాబోయే తొలి పంటకే సాగునీరు అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.



# కొత్త తెల్ల రేషన్ కార్డులకు ముహూర్తం ఖరారు

- ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ
- 1.05 కోట్ల ల్యామినేటెడ్ కార్డులు అర్హులకు
- సంగారెడ్డిలో సీఎం చేతుల మీదుగా ప్రారంభం

**హైదరాబాద్, ఆగస్టు 6:** తెలంగాణలో కొత్త తెల్ల రేషన్ కార్డుల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. స్వాతంత్ర్య దినోత్సవమైన ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఆహార భద్రతను విస్తరించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1.05 కోట్ల కొత్త ల్యామినేటెడ్ రేషన్ కార్డులను అర్హులకు అందజేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. సంగారెడ్డి జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుండగా, అదే సమయంలో రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒకేసారి పంపిణీ కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రేషన్ కార్డుల పంపిణీ నిర్వహించనున్నారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు ప్రతి నియోజకవర్గంలో పర్యవేక్షణ బాధ్యతలను ఆర్డీవోలకు అప్పగించినట్లు ప్రభుత్వం తెలిపింది. స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల సమక్షంలో పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్డులు తీసుకునేందుకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, కూర్చునే ఏర్పాట్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పంపిణీ పూర్తయిన వెంటనే ప్రతి నియోజకవర్గం నుంచి సమగ్ర నివేదికలను ప్రభుత్వానికి సమర్పించాలని కూడా స్పష్టం చేశారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, "అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఏ ఒక్క అర్హుడు కూడా ఈ పథకానికి దూరం కాకుండా పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తాం" అని తెలిపారు.



# స్వీయ రాజకీయ అస్తిత్వమే శ్రీరామరక్ష

- తెలంగాణ కోసం చివరి శ్వాస వరకు తపించిన జయశంకర్ సార్
- కేసీఆర్ పట్టుదలపై సంపూర్ణ విశ్వాసంతో వెన్నంటి నిలిచారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- జయంతి సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఘన నివాళులు



**హైదరాబాద్, ఆగస్టు 6:** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జీవితాంతం తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా పనిచేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. జయశంకర్ సార్ జయంతి సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం కేటీఆర్ మాట్లాడారు. కేసీఆర్‌కు మించిన దక్షత, నిబద్ధత, తెలంగాణ సాధించాలనే పట్టుదల ఉన్న నాయకుడిని చూపిస్తే ఆయన వెంట నడుస్తానని జయశంకర్ సార్ బహిరంగంగానే చెప్పేవారని కేటీఆర్ గుర్తుచేశారు. తెలంగాణ సాధన లక్ష్యంగా ఏర్పడిన ఇతర రాజకీయ పార్టీల విషయంలోనూ విభేదాలు కాకుండా లక్ష్యసారూప్యత ఉండాలని ఆయన ఎప్పుడూ సూచించేవారని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఎన్ని కొత్త పార్టీలు వచ్చినా, అందరి లక్ష్యం తెలంగాణ రాష్ట్ర సాధనే కావాలని జయశంకర్ సార్ ఆకాంక్షించారని కేటీఆర్ పేర్కొన్నారు. ఉద్యమ శక్తులు పరస్పరం కలహించకుండా సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన సూచించేవారని చెప్పారు. ప్రస్తుతం తెలంగాణ నీటి హక్కులకు మళ్లీ ముప్పు ఏర్పడుతోందని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణకు సంబంధించిన ఏడు ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ కేంద్రాన్ని కోరుతోందని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సమర్థంగా స్పందించడం లేదని విమర్శించారు. తెలంగాణ కోసం పుట్టిన పార్టీ అధికారంలో ఉంటే ఇలాంటి పరిస్థితి వచ్చేదా అని ప్రశ్నించారు. లోక్‌సభలో తెలంగాణ విభజనను పాకిస్తాన్‌తో పోల్చిన వ్యాఖ్యలపై బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఎవరూ స్పందించలేదని, బీఆర్ఎస్ ప్రతినిధులు ఉంటే గట్టిగా నిలదీసేవారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరచూ ఢిల్లీ పర్యటనలు చేస్తుండడాన్ని ప్రస్తావిస్తూ, తెలంగాణ నాయకత్వం ఢిల్లీపై ఆధారపడకుండా స్వతంత్రంగా ఉండాలని జయశంకర్ సార్ ఎప్పుడూ కోరుకున్నారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. తెలంగాణకు స్వీయ రాజకీయ అస్తిత్వమే నిజమైన రక్షణ అని, రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీ పడకుండా గళమెత్తే నాయకత్వం అవసరమని జయశంకర్ సార్ విశ్వసించారని చెప్పారు. తెలంగాణ ఆత్మగౌరవం, రాష్ట్ర హక్కుల పరిరక్షణ కోసం కేసీఆర్ తరహా ధైర్యవంతమైన నాయకత్వమే అవసరమని, అదే జయశంకర్ సార్ ఆకాంక్ష అని కేటీఆర్ పేర్కొన్నారు.

# గోదావరి ప్రాజెక్టులకు సమాధి కట్టే కుట్ర

- ఏపీ డైరెక్షన్‌లో జీఆర్ఎంబీ నడుస్తోంది
- 'జై తెలంగాణ' అనని వ్యక్తి సీఎంగా ఉన్నారు: హరీశ్‌రావు
- జయశంకర్ ఆరాటం.. కేసీఆర్ పోరాటంతోనే తెలంగాణ సాధ్యమైందని వ్యాఖ్య



**సిద్దిపేట, ఆగస్టు 6:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గోదావరి ప్రాజెక్టుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ) ఆంధ్రప్రదేశ్ డైరెక్షన్‌లో పనిచేస్తోందని, తెలంగాణ ప్రభుత్వం మౌనంగా చూస్తోందని విమర్శించారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా సిద్దిపేటలో ఆయన విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని, "జై తెలంగాణ" అని ఎప్పుడూ పలకని వ్యక్తి నేడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నారని సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి ప్రొఫెసర్ జయశంకర్ ఆరాటం, కేసీఆర్ పోరాటమే ప్రధాన కారణమని హరీశ్‌రావు పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో గోదావరి జలాల్లో 380 టీఎంసీల నీటిని తెలంగాణ హక్కుగా సాధించామని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమానికి నీటి హక్కులే ప్రధాన ప్రేరణగా నిలిచాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడిచినా ఒక్క కొత్త ప్రాజెక్టుకు కూడా అనుమతులు సాధించలేకపోయిందని ఆయన విమర్శించారు. గతంలో జీఆర్ఎంబీ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్ అభ్యంతరాలను తిప్పికొట్టి తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు తెచ్చామని, ఇప్పుడు ఇప్పటికే అనుమతులు పొందిన ప్రాజెక్టులను కూడా రద్దు చేసి పునఃసమీక్షించాలనే అంశాన్ని అజెండాలో చేర్చడం దురదృష్టకరమని అన్నారు. ప్రభుత్వానికి ప్రాజెక్టులు, నీటి హక్కులపై చిత్తశుద్ధి ఉంటే జీఆర్ఎంబీ అజెండాను వెంటనే మార్చించాలని, అవసరమైతే ఆ సమావేశాన్ని బహిష్కరించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ చేపడుతున్న బనకచర్ల ప్రాజెక్టును ఎందుకు అడ్డుకోలేకపోతున్నారని ప్రశ్నించారు. సమ్మక్క-సారక్క ప్రాజెక్టుకు అవసరమైన హైడ్రాలజీ అనుమతులు వచ్చినప్పటికీ ప్రభుత్వం దానిని ఎందుకు ముందుకు తీసుకెళ్లడం లేదని నిలదీశారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ రెండో దశకు సమ్మక్క-సారక్క ప్రాజెక్టు నీరు కీలకమని పేర్కొన్నారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌తో లోపాయికారీ ఒప్పందం చేసుకుందని హరీశ్‌రావు ఆరోపించారు. మొదట జీఆర్ఎంబీ అజెండాలో లేదని చెప్పి, తర్వాత ఢిల్లీలో జరిగిన సమావేశంలో చేర్చి, సమావేశానికి వెళ్లమని చెప్పి చివరకు సంతకాలు చేశారని విమర్శించారు. కోర్టుల్లో ప్రభుత్వం దాఖలు చేసిన వ్యాజ్యాల నిర్వహణ కూడా పూర్తిగా విఫలమైందని, కనీసం రిట్ పిటిషన్‌ను సక్రమంగా నిర్వహించే సామర్థ్యం కూడా ప్రభుత్వానికి లేదని ఎద్దేవా చేశారు.

# సచివాలయం ప్రాంగణంలో ఘనంగా బోనాల ఉత్సవాలు



**హైదరాబాద్, ఆగస్ట్ 6:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గురువారం సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సచివాలయ ఆవరణలోని శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయంలో నిర్వహించిన పూజల్లో ప్రధాన కార్యదర్శి పాల్గొని రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు సంప్రదాయబద్ధంగా బోనాలను సమర్పించగా, పోతరాజుల విన్యాసాలు, డప్పుల వాయిద్యాలు, వివిధ వేషధారణలతో కళాకారుల ప్రదర్శనలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, అధికారులు ఉత్సవాల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో సుభిక్షం, శాంతి, అభివృద్ధి నెలకొనాలని ఆకాంక్షించారు.





# జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

## గుత్తా సుఖేందర్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 6:** తెలంగాణ సిద్ధాంతకర్త, స్వర్గీయ ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి సందర్భంగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సభలో శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాశ్, మంత్రి హాజహరుద్దీన్ పాల్గొన్నారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. తెలంగాణ ఆవశ్యకతను విద్యార్థులకు, ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా వివరించి ఉద్యమానికి దిశానిర్దేశం చేశారని చెప్పారు. అలాగే, జయశంకర్ ఆశయాలు ఇంకా పూర్తిస్థాయిలో నెరవేరాల్సి ఉందని పేర్కొంటూ, హైదరాబాద్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్ నేతలు తమ రాజధాని అమరావతిలో స్థిరపడితేనే జయశంకర్ కోరుకున్న తెలంగాణ పూర్తిస్థాయిలో సాకారమైనట్లుగా భావిస్తామని వ్యాఖ్యానించారు. జయశంకర్ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని యువత తమ జీవిత లక్ష్యాలను సాధించాలని ఆయన పిలుపునిచ్చారు.



# కేటీఆర్‌తో అంబేద్కర్ మనవడి భేటీ

**హైదరాబాద్, ఆగస్ట్ 6:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో వంచిత్ బహుజన్ అగాడీ అధినేత ప్రకాష్ అంబేద్కర్ గురువారం హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మనవడు ప్రకాష్ అంబేద్కర్ బంజారాహిల్స్ లోని నివాసంలో కేటీఆర్‌తో ప్రత్యేకంగా సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు జగదీష్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను, పార్టీ నాయకులను కేటీఆర్ పరిచయం చేశారు. భేటీ అనంతరం ప్రకాష్ అంబేద్కర్‌ను కేటీఆర్ శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

# సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణకు దేశంలో తొలి స్థానం




**హైదరాబాద్, ఆగస్టు 6 :** సైబర్ నేరాల నియంత్రణ, బాధితులకు వేగవంతమైన సేవలందించడంలో తెలంగాణ దేశంలోనే తొలి స్థానంలో నిలిచినట్లు రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ షిఖా గోయల్ తెలిపారు. ప్రధానమంత్రి కార్యాలయం నిర్వహించిన 'ప్రగతి' సమీక్షలో కేంద్ర హోంశాఖ పరిధిలోని డిజిటల్ సైబర్ వ్యవస్థల వినియోగం, పనితీరు ఆధారంగా తెలంగాణకు ఈ గుర్తింపు లభించినట్లు వెల్లడించారు. దేశంలోనే తొలిసారిగా రాష్ట్ర సైబర్ నేరాల సమన్వయ కేంద్రం ఏర్పాటు, డిజిటల్ జీరో ఎఫ్ఐఆర్ అమలు, ఫిర్యాదుల పరిష్కారం, మనీ రెస్టోరేషన్, 'సహాయోగ్' వేదిక, అంతర్రాష్ట్ర సమన్వయం, సైబర్ హాట్‌స్పాట్ల గుర్తింపు, అధికారులకు శిక్షణ, ప్రజల్లో అవగాహన కల్పన వంటి తొమ్మిది కీలక అంశాల్లో రాష్ట్రం అత్యుత్తమ పనితీరు కనబర్చినందుకు కేంద్రం ప్రశంసించింది. ఆగస్టు 2 నాటికి ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో 2,368 దరఖాస్తుల్లో 2,086 పరిష్కరించి 88 శాతం విజయాన్ని నమోదు చేసింది. మనీ రెస్టోరేషన్ వేదిక ద్వారా రూ.16.42 కోట్ల మేర బాధితులకు తిరిగి అందించే ప్రక్రియ కొనసాగుతుండగా, 28,097 ఉత్తర్వులు జారీ అయ్యాయి. 'సహాయోగ్' వేదికలో 22,447 అనుచిత వెబ్ లింకుల్లో 20,070 తొలగించి 89.41 శాతం విజయాన్ని సాధించింది. అంతర్రాష్ట్ర సమన్వయ వేదికలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన విజ్ఞప్తుల్లో 96.68 శాతం పూర్తి చేసింది. బాధితుల సహాయార్థం ప్రత్యేక హెల్ప్‌లైన్ 8712665600ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు షిఖా గోయల్ తెలిపారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే ఫిర్యాదు నమోదు చేసి, అందుబాటులో ఉన్న డిజిటల్ సేవలను వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు.

# 20 నెలల్లో 150 జీసీసీలు.. 1.5 లక్షల ఉద్యోగాలు

## హైదరాబాద్ పెట్టుబడులకు గ్లోబల్ హబ్‌గా ఎదుగుతోంది

## జేఎల్ఎల్ జీసీసీ ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు

## మరో రెండేళ్లలో 1,600 మందికి ఉపాధి

**హైదరాబాద్, ఆగస్టు 6 :** గత 20 నెలల్లో తెలంగాణలో 150 కొత్త గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు (జీసీసీలు) ఏర్పాటై, వాటి ద్వారా సుమారు 1.5 లక్షల మందికి ఉపాధి కల్పించామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో జేఎల్ఎల్ (జోన్స్ లాంగ్ లాసెల్) సంస్థ ఏర్పాటు చేసిన గ్లోబల్ కెపబిలిటీ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులకు అనువైన నగరాలను గుర్తించే జేఎల్ఎల్ వంటి అంతర్జాతీయ సంస్థ హైదరాబాద్‌ను తన జీసీసీ కేంద్రంగా ఎంచుకోవడం తెలంగాణపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమన్నారు. సంప్రదాయ ఐటీ సేవల కంటే ఇన్నోవేషన్ ఆధారిత జీసీసీలు భవిష్యత్ ఉపాధికి ప్రధాన కేంద్రాలుగా మారుతున్నాయని చెప్పారు. కృత్రిమ మేధ, ఆటోమేషన్ వంటి సాంకేతిక మార్పులు వచ్చినా జీసీసీల ప్రాధాన్యం మరింత పెరుగుతోందని పేర్కొన్నారు. మంత్రి వెల్లడించిన వివరాల ప్రకారం, 2024 నుంచి 2026 మధ్య దేశవ్యాప్తంగా జీసీసీల కార్యాలయ లీజింగ్‌లో హైదరాబాద్ వాటా 16 శాతానికి చేరుకోగా, నగరంలో జరిగిన మొత్తం కార్యాలయ లీజింగ్‌లో జీసీసీల వాటా 42 శాతంగా నమోదైంది. ఆరోగ్య సంరక్షణ, బయోటెక్నాలజీ, సెమీకండక్టర్ రంగాలకు చెందిన గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లకు కూడా హైదరాబాద్ తొలి ఎంపికగా నిలుస్తోందని చెప్పారు. జేఎల్ఎల్ ఏర్పాటు చేసిన గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించిన తర్వాత వచ్చే రెండేళ్లలో సుమారు 1,600 మందికి ఉపాధి లభించనుందని మంత్రి తెలిపారు. ఈ కేంద్రం ద్వారా ఫైనాన్స్, మానవ వనరులు, ప్రాజెక్టు నిర్వహణ, లీజ్ అడ్మినిస్ట్రేషన్, అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్, సాంకేతిక సేవలను ప్రపంచవ్యాప్తంగా జేఎల్ఎల్ కార్యకలాపాలకు అందించనున్నారు.



ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
శుక్రవారం
7 ఆగస్టు 2026

## సంపాదకీయం



# పార్లమెంట్‌లో తగ్గుతున్న చర్చల స్థాయి

### ప్రజా సమస్యలపై దృష్టి పెట్టని అధికార, విపక్షాలు!

పార్లమెంట్ సమావేశాలు నానాటికీ దిగజారి పోతున్నాయి. అధికార, విపక్షాల పట్టుతో సమావేశాలు సాగడం లేదు. గందరగోళం మధ్యనే ప్రభుత్వం బిల్లులు పాస్ చేసుకుంటూ పోతోంది. విపక్షం కూడా తాము పట్టిన కుందేటికి మూడేకాళ్లు అన్నచందంగా సాగుతోంది. చర్చలు జరక్కుండా ప్రజాధనం వృధా చేస్తున్నారు. వర్షాకాల సమావేశాలు కూడా ఎలాంటి పురోగతి లేకుండా ముగింపు దశకు చేరుకున్నాయి. అసలు మోడీ హయాంలో చర్చలు సాగడం లేదని అనుకుంటుంటే విపక్షం అంతకుమించి అన్నట్లుగా పార్లమెంట్ స్తంభనకే పట్టుబడతోంది. ఇది నిజంగా పార్లమెంట్ చరిత్రలో మాయని మచ్చగా నిలిచిపోవడం ఖాయం. ఎందుకంటే గత కొన్ని ఏళ్లుగా పరిశీలన చేస్తే అసలు చర్చలు సాగడం లేదు. అర్థవంతమైన చర్చలు అస్సలు చేయడం లేదు. విపక్షలు పార్లమెంట్‌లో గందరగోళం సృష్టించి, పార్లమెంట్ బయట ఆందోళనలు చేస్తున్నాయి. పార్లమెంట్‌లో ఎన్నో అవకాశాలు ఉంటాయి. ఎన్నో రూల్స్ ఉంటాయి. వారు చర్చించాల్సన విషయాలను ఈ పద్దతిలో చర్చించడం లేదు. కేవలం రాజకీయం క ఓసం రచ్చ మార్గాన్ని ఎన్నుకున్నాయి. ఇకపోతే స్పీకర్ సమర్థతపైనే చట్టసభల్లో సమస్యలపై చర్చ సాగుతుంది. స్పీకర్ నిజాయితీగా, నిష్పక్ష పాతంగా ఉంటే చట్టసభల్లో అర్థవంతమైన చర్చకు అవకాశం ఉంటుంది. అసెంబ్లీ అయినా పార్లమెంట్ అయినా ఇదే వర్తిస్తుంది. గతంలో కాంగ్రెస్ హయాలో అయినా, ఎన్‌డిఎ హయాంలో అయినా చర్చలు ఫలవంతంగా సాగేవి. ప్రతిపక్షాలు ఎక్కడ ఏ సమస్యలు లేవనెత్తుతాయా అని ప్రభుత్వాలు ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేసేవి. నీలం సంజీవరెడ్డి, బలరామ్ జాకడ్, శివరాజ్ పాటిల్, పిఎ సంగ్మా ఇలా ఎందరో స్పీకర్లు సభాధ్యక్షస్థానానికి వన్నె తెచ్చారు. సమస్యలపై చర్చలకు అవకాశం ఇచ్చారు. ఇక్కడ చర్చలంటే విపక్షం నుంచే అన్నది వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే గత 12 ఏళ్లుగా అంటే..మోడీ అధికారం చేపట్టిన తరవాత చట్టసభల్లో అర్థవంతమైన చర్చలకు ఆస్కారం లేకుండా పోయింది. అర్థవంతం కాదు కదా అసలు చర్చలకే ఆస్కారం కనిపించడం లేదు. విపక్షం నుంచి ఎవరైనా లేస్తే..స్పీకర్ మైక్ కట్ చేయడం అలవాటు చేసుకున్నారు. అలాంటప్పుడు ప్రజలు ఏమనుకుంటున్నారో ఎలా తెలుస్తుంది. నిజానికి ప్రభుత్వమే చర్చలకు ఆహ్వానించాలి. తమ పాలనా విధానాలపై ప్రజల్లో ఎలాంటి ప్రభావం ఉందో అన్నది తెలుసుకోవాలి. అయితే మోడీ ప్రభుత్వం సమస్యలపై చర్చలను కోరుకోవడం లేదు. చర్చ జరిగితే సమాధానం ఇవ్వడం, ఇరుకున పడడం ప్రభుత్వానికి ఇష్టం లేదన్నది అర్థం అవుతోంది. ఇలాంటి సందర్భాల్లో స్పీకర్ జోక్యం చేసుకుని ప్రతిపక్ష సభ్యులతో మాట్లాడడం, వారిని అనునయించడం జరిగేది. వారు ఏం కోరుకుంటున్నారో మైక్ ఇవ్వడం ద్వారా తెలుసుకోవచ్చు. కానీ లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా అలాంటి ప్రయత్నాలు చేయడం లేదు. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఏదేని సమస్యపై లేచి నిలబడితే మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదన్నది ప్రధాన అరోపణ. కనీసం విపక్షనేతకు గౌరవం ఇవ్వాలన్న ఆలోచన కూడా లేకుండా లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా వ్యవహరిస్తున్నారని విపక్ష సభ్యులు పదేపదే అరోపిస్తున్నారు. సమావేశాలను ప్రత్యక్షం గా వీక్షించే వారికి ఇది స్పష్టంగా కనిపిస్తుంది. ఇక ఈ సీజన్‌లో అసలు విపక్ష సభ్యులు కూడా మాట్లాడకుండా పోడియం వద్దకు రావడం, నినాదాలు చేయడం, వెళ్లిపోవడం అలవాటు చేసుకున్నారు. దీంతో స్పీకర్ కూడా సభను వాయిదా వేసి పోతున్నారు. ఇంత జరుగుతున్నా ప్రధాని మోడీ సభకు హాజరు కావడం లేదు. విద్యార్థుల సమస్యలు కావచ్చు, ఇతర సమస్యలు కావచ్చు..ప్రధాని మాట్లాడడం లేదు. కేవలం సోషల్ మీడియా ద్వారా తన భావాలను వెల్లడిస్తున్నారు. బలాల సంఖ్య ఎలా ఉన్నా విషయం మాత్రం ప్రజలకు కూడా అర్థం అవుతోంది. పార్లమెంట్ సమావేశాలు ఎన్ని రోజులు జరిగినా మొక్కుబడిగా మమ అనిపిస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చ సాగడం లేదు. దేశంలో అవినీతి, అక్రమాలు, నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి అనేక సమస్యలు ఉన్నాయి. సమావేశాల్లో అనేక అంశాలపై చర్చకు అవకాశం ఉంటుంది.కానీ విపక్షాలకు అలాంటి అవకాశం రావడం లేదు. కేవలం ప్రధాని పడికట్టు పదాలతో ఇచ్చే ఉపన్యాసమే ప్రధాన వార్తగా చలామణి అవుతుంది. వికసిత భారత్, ఆత్మనిర్భర భారత్ వంటి పడికట్టు పదాలు తప్ప దేశం పురోగతికి సంబంధించి న అంశాలపై చర్చలకు ఆస్కారం కలగడం లేదు. వాజ్‌పేయ్, పివి నరసింహారావు, రాజీవ్ గాంధీ, మన్మోహన్ సింగ్ ప్రధానులుగా ఉన్న సమయాల్లోనూ పార్లమెంటులో అర్థవంతమైన చర్చలు సాగేవి. కానీ ప్రస్తుతం చర్చలకు ఆస్కారం లేకపోవడంతో విపక్ష ఎంపిలు పోడియం వద్ద ఆందోళన చేయడం, సభనుంచి బయటకు రావడం రివాజుగా మారింది. ఇకపోతే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ విషయంలో ఎందుకనో విపక్షం వైపు చూడడం మానేశారు. విపక్ష సభ్యుల ప్రస్తావనలకు స్పందించడం లేదు. ఇది ఆయన ఆత్మ పరిశీలన చేసుకోవాలి. అంతేకాదు...తన వైఖరిని మార్చుకుని ప్రజలకోసం పార్లమెంట్ అన్నది గుర్తించాలి. రాజకీయంగా ఎన్ని విభేదాలు ఉన్నా, పార్లమెంటులో చర్చలు జరగాలి. అర్థవంతమైన చర్చలకు ఆస్కారం ఉండాలి. స్పీకర్ అలాంటి అవకాశం కల్పించాలి. గతంలో పనిచేసిన స్పకీర్లు అనుసరించిన తీరును నడవాలి. అప్పుడే పార్లమెంట్ సమావేశాలకు అర్థం ఉంటుంది. అధికార బిజెపి కూడా ప్రజాస్వామ్యబద్దంగా పనిచేయడానికి సిద్ధంగా ఉండాలి. గత పదేళ్లతో పోలిస్తే 2024 ఎన్నికల్లో బిజెపి బలం గణనీయంగా పడిపోయింది. ఇప్పుడు ఎన్‌డిఎ పక్షాల మద్దతుతో కొనసాగుతున్నామని గుర్తించాలి. ఇంకా మభ్య పెట్టే పనులతో ప్రజల్లో మరింత పలచన కాకుండా చూసుకుంటే మంచిది. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో ప్రధాని సభకు రావడం మర్యాద. విపక్షాలకు కూడా ఆయన సూచనలు చేయవచ్చు. కానీ మంత్రులతోనే పనికానిచ్చేద్దాఆమంటే సరికాదు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. దీనిని గుర్తించకుంటే ప్రజలు తగిన సమయంలో స్పందిస్తారు.

# విద్య వ్యాపారంగా మారింది : అభిజీత్ దీప్కే

- నిరుద్యోగం, విద్య, ప్రజాస్వామ్య వ్యవస్థలపై ఉద్యమం
- ప్రెజర్ గ్రూపుగానే కొనసాగుతాం.. ఎన్నికల్లో పోటీ చేసే ఆలోచన లేదు
- 'క్యా బోల్తీ పబ్లిక్' పేరుతో దేశవ్యాప్త ప్రచారానికి శ్రీకారం



**ముంబై, ఆగస్టు 6:** దేశంలో విద్య క్రమంగా వ్యాపార వస్తువుగా మారుతోందని, చిన్నారుల విద్యకే లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగం, విద్యా సంస్కరణలు, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య వ్యవస్థల జవాబుదారీతనం వంటి అంశాలపై దేశవ్యాప్తంగా 'క్యా బోల్తీ పబ్లిక్' పేరుతో ప్రజా ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. మహారాష్ట్రలో పార్టీ ప్రధాన బృంద సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన దీప్కే, సెప్టెంబర్ నుంచి దేశవ్యాప్తంగా పర్యటించి విద్యార్థులు, యువత, సాధారణ ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటామని తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా విని ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. సీజేపీని రాజకీయ పార్టీగా కాకుండా ప్రజల తరఫున పనిచేసే ప్రెజర్ గ్రూప్‌గానే కొనసాగించాలని నిర్ణయించుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ఎన్నికల్లో పోటీ చేసే ఆలోచన లేదని, ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. దేశ యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగం, ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులు, ప్రభుత్వ పాఠశాలల నాణ్యత, ప్రభుత్వ వ్యవస్థలపై తగ్గుతున్న ప్రజా విశ్వాసం వంటి అంశాలపై ఉద్యమాన్ని మరింత విస్తరిస్తామని తెలిపారు. ఈ ప్రచారంలో విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశంలో సంస్థాగత జవాబుదారీతనం ప్రమాదకర స్థితికి చేరుకుందని అభిజీత్ దీప్కే వ్యాఖ్యానించారు. గతంలో ప్రజలు ప్రభుత్వాలను ఎన్నుకునేవారని, ఇప్పుడు ఎవరు అధికారంలోకి రావాలనే దానిపై వ్యవస్థల ప్రభావం పెరుగుతోందని ఆరోపించారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యా రంగంలో ఫీజుల భారం మధ్యతరగతి కుటుంబాలను తీవ్రంగా ఇబ్బంది పెడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్‌కేజీ నుంచే లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారని, పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలనే తల్లిదండ్రుల ఆకాంక్ష ఆర్థిక భారంగా మారుతోందన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విద్యను ప్రాథమిక హక్కుగా పేర్కొన్నప్పటికీ, ప్రస్తుతం అది వ్యాపారంగా మారిందని విమర్శించారు. పార్టీ సభ్యత్వం పూర్తిగా ఉచితమని, అధికారిక క్యూ ఆర్ కోడ్‌ల ద్వారానే నమోదు చేసుకోవాలని సూచించారు. తప్పుడు చెల్లింపు లింకులు, మోసపూరిత అభ్యర్థనల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రజల తరఫున ప్రభుత్వాలను జవాబుదారీగా నిలబెట్టే ఒత్తిడి వేదికగా సీజేపీ పనిచేస్తుందని, దేశంలో ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయడమే తమ ఉద్యమం లక్ష్యమని అభిజీత్ దీప్కే తెలిపారు.



# తెహల్కా మాజీ ఎడిటర్‌కు 10 ఏళ్ల జైలు

**లైంగిక దాడి కేసులో హైకోర్టు సంచలన తీర్పు**

**5 లక్షల జరిమానా.. 2 వారాల్లో లొంగిపోవాలని ఆదేశం**

**ముంబై, ఆగస్టు 6:** తెహల్కా మాజీ ఎడిటర్ తరుణ్ తేజ్‌పాల్‌కు 2013లో నమోదైన లైంగిక దాడి కేసులో బాంబే హైకోర్టు గోవా బెంచ్ పదేళ్ల జైలు శిక్ష విధించింది. రూ.5 లక్షల జరిమానా కూడా విధించిన న్యాయస్థానం, రెండు వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశించింది. 2013లో గోవాలో జరిగిన 'థింక్‌ఫెస్ట్' కార్యక్రమం సందర్భంగా హోటల్ లిఫ్ట్‌లో తనపై జూనియర్ సహోద్యోగినిపై లైంగిక దాడికి పాల్పడ్డారని నమోదైన కేసులో గతంలో గోవా ట్రయల్ కోర్టు తేజ్‌పాల్‌ను నిర్దోషిగా ప్రకటించింది. అయితే ఆ తీర్పును గోవా ప్రభుత్వం బాంబే హైకోర్టులో సవాలు చేయగా, ట్రయల్ కోర్టు తీర్పును రద్దు చేసిన హైకోర్టు తేజ్‌పాల్‌ను దోషిగా నిర్ధారించి శిక్ష ఖరారు చేసింది. విచారణ సందర్భంగా గోవా ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, బాధితురాలు పలుమార్లు నిరాకరించినప్పటికీ తేజ్‌పాల్ ఆగలేదని, "నో అంటే నో" అనే మౌలిక సూత్రాన్ని విస్మరించారని కోర్టుకు వివరించారు. బాధితురాలు ఆయన కింద పనిచేసే ఉద్యోగి కావడంతో, అధికార అసమానతను తేజ్‌పాల్ దుర్వినియోగం చేశారని న్యాయస్థానం తన తీర్పులో పేర్కొంది. తీర్పు అనంతరం మీడియాతో మాట్లాడిన తరుణ్ తేజ్‌పాల్, తాను ఎలాంటి నేరం చేయలేదని, ఈ తీర్పుతో ఏకీభవించడం లేదని చెప్పారు. సుప్రీంకోర్టును ఆశ్రయించి న్యాయపోరాటం కొనసాగిస్తానని తెలిపారు. తాను రాజకీయ కక్షసాధింపునకు గురయ్యానని ఆరోపిస్తూ, ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్, సురేంద్ర గాడ్లింగ్ కేసులను ప్రస్తావించారు. 2013 నవంబర్ 7, 8 తేదీల్లో గోవాలో జరిగిన థింక్‌ఫెస్ట్ సందర్భంగా హోటల్ లిఫ్ట్‌లో రెండు సార్లు తనపై అత్యాచారం జరిగిందంటూ బాధితురాలు ఫిర్యాదు చేయగా, అదే ఏడాది నవంబర్‌లో తేజ్‌పాల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. దాదాపు 13 ఏళ్ల న్యాయపోరాటం అనంతరం హైకోర్టు ఆయనను దోషిగా నిర్ధారించి పదేళ్ల జైలు శిక్ష విధించింది.

# బయోగ్యాస్‌కు కేంద్రం భారీ ఊతం

**రూ.23,731 కోట్ల 'గోబర్ధన్' పథకానికి కేబినెట్ ఆమోదం**

**అస్సాంలో రూ.8,970 కోట్ల జాతీయ రహదారి నిర్మాణానికీ గ్రీన్ సిగ్నల్**




**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** దేశంలో బయోగ్యాస్ ఉత్పత్తిని విస్తృతంగా ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన గురువారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో రూ.23,731 కోట్ల వ్యయంతో 'గోబర్ధన్' జాతీయ సర్క్యులర్ బయోఎనర్జీ పథకానికి ఆమోదం లభించింది. ఈ పథకాన్ని 2026-27 నుంచి 2035-36 వరకు అమలు చేయనున్నారు. వ్యవసాయ అవశేషాలు, పశువుల పేడ, సేంద్రీయ వ్యర్థాలను వినియోగించి కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ఉత్పత్తి చేయడం ద్వారా దేశీయ బయోగ్యాస్ ఉత్పత్తిని దాదాపు పది రెట్లు పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోంది. దిగుమతి సహజవాయువుపై ఆధారాన్ని తగ్గించడంతో పాటు దేశ ఇంధన భద్రతను బలోపేతం చేయడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తుందని కేంద్ర మంత్రులు తెలిపారు. రైతులు, గ్రామీణ పారిశ్రామికవేత్తలు, సహకార సంఘాలకు కొత్త ఆదాయ వనరులు లభించడంతో పాటు సేంద్రియ వ్యర్థాల సమర్థ వినియోగానికి కూడా ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. అదే సమావేశంలో అస్సాంలో రూ.8,970 కోట్ల వ్యయంతో నాలుగు లేన్ల జాతీయ రహదారి నిర్మాణానికి కూడా కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుతో రాష్ట్రంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడి, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి ఊతం లభిస్తుందని ప్రభుత్వం వెల్లడించింది.

# అరుణాచల్‌లో భూప్రకంపనలు

**రిక్టర్ స్కేల్‌పై 5.1 తీవ్రత నమోదు**

**ప్రాణ, ఆస్తి నష్టం లేదన్న అధికారులు**




**ఇటానగర్, ఆగస్టు 6:** అరుణాచల్‌ప్రదేశ్‌లోని అప్పర్ సియాంగ్ జిల్లాలో గురువారం భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 5.1గా నమోదైనట్లు జాతీయ భూకంప పరిశీలన కేంద్రం (ఎన్‌సీఎస్) వెల్లడించింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని అధికారులు తెలిపారు. ఉదయం 5.45 గంటలకు అప్పర్ సియాంగ్ జిల్లాలోని పాంగిన్‌కు 116 కిలోమీటర్ల దూరంలో, 11 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు ఎన్‌సీఎస్ పేర్కొంది. ప్రధాన భూకంపానికి ముందు మూడు స్వల్ప ప్రకంపనలు నమోదయ్యాయని తెలిపింది. ఉదయం 3.40 గంటలకు 2.8 తీవ్రతతో, 3.55 గంటలకు 3.2 తీవ్రతతో, 4.34 గంటలకు మరోసారి 2.8 తీవ్రతతో ప్రకంపనలు సంభవించినట్లు వెల్లడించింది. భూకంపం అనంతరం పరిస్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఇదే రాష్ట్రంలోని షి యోమి జిల్లాలో బుధవారం కూడా రిక్టర్ స్కేల్‌పై 5.0 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఆ జిల్లాకు ఈశాన్యంగా 60 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం నమోదైనప్పటికీ అక్కడ కూడా ఎలాంటి నష్టం జరగలేదు. ఈశాన్య భారతదేశం భూకంపాలకు అత్యంత సున్నితమైన ప్రాంతంగా గుర్తింపు పొందింది. అందువల్ల ఈ ప్రాంతంలో తరచూ భూప్రకంపనలు సంభవిస్తుంటాయని భూకంప నిపుణులు పేర్కొంటున్నారు.

# అగ్ని-4 క్షిపణి పరీక్ష సక్సెస్

**ఒడిశాలోని చాందీపూర్ నుంచి ప్రయోగం విజయవంతం**


**4,000 కి.మీ. దూరంలోని లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం**




**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** భారత వ్యూహాత్మక రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తూ మధ్యంతర శ్రేణికి చెందిన అగ్ని-4 బాలిస్టిక్ క్షిపణి పరీక్షను భారత్ విజయవంతంగా నిర్వహించింది. ఒడిశాలోని చాందీపూర్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి గురువారం నిర్వహించిన ఈ ప్రయోగం విజయవంతమైనట్లు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ (ఎస్‌ఎఫ్‌సీ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షలో క్షిపణి నిర్ణీత లక్ష్యాన్ని కచ్చితంగా చేరుకుందని, నిర్వహణా, సాంకేతిక ప్రమాణాలన్నింటినీ విజయవంతంగా అందుకుందని రక్షణ శాఖ తెలిపింది. అగ్ని-4 రెండు దశల్లో ప్రయాణించే భూ ఉపరితలం నుంచి భూ ఉపరితలంపైకి ప్రయోగించే మధ్యంతర శ్రేణి బాలిస్టిక్ క్షిపణి. ఘన ఇంధన రాకెట్ మోటార్‌తో పనిచేసే ఈ క్షిపణి సుమారు 4,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. భారీ పేలోడ్‌ను మోసుకెళ్లే సామర్థ్యం కూడా దీనికి ఉంది. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో), స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ సంయుక్తంగా అగ్ని శ్రేణి క్షిపణులను అభివృద్ధి చేస్తున్నాయి. దేశ రక్షణ సామర్థ్యాన్ని మరింత పటిష్ఠం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా ఉంది. ఇటీవలే డీఆర్‌డీవో దీర్ఘ శ్రేణి గైడెడ్ రాకెట్ పినాకాను విజయవంతంగా పరీక్షించింది. అలాగే ఈ ఏడాది ప్రారంభంలో అగ్ని ప్రైమ్, అగ్ని-3 క్షిపణుల పరీక్షలను కూడా విజయవంతంగా పూర్తి చేసింది. అగ్ని-4 తాజా విజయంతో భారత వ్యూహాత్మక క్షిపణి సామర్థ్యం మరింత బలోపేతమైందని రక్షణ వర్గాలు పేర్కొంటున్నాయి.

# జెన్-జీ దేశ వ్యతిరేకులు కాదు

**ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్**



**ముంబై:** జెన్-జీ యువత దేశ వ్యతిరేకులు కాదని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలు, వారు వ్యక్తం చేస్తున్న ఆందోళనలు సమర్థనీయమైన వేనని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసనలు అనేవి సంభాషణకు, సమస్యల పరిష్కారానికి దోహదపడే మార్గాలని ఆయన స్పష్టం చేశారు. ముంబైలో నిర్వహించిన ఐఐఎమ్‌యూఎన్ సమావేశంలో మోహన్ భాగవత్ పాల్గొన్నారు. అనంతరం జెన్-జీ, జెన్-ఆల్ఫా విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ చీఫ్ మాట్లాడుతూ.. తమ కాలంలో పెద్దల మాటకు ప్రాధాన్యం ఇచ్చేవారమని, అయితే నేటి జెన్-జీ ప్రతి అంశానికి తార్కిక వివరణలు కోరుకుంటోందని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రశ్నించడం, తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం, నిరసనలు తెలియజేయడం ప్రజాస్వామ్య హక్కులేనని మోహన్ భాగవత్ చెప్పుకొచ్చారు. అయితే నిరసనలు చేపట్టేందుకు ప్రజాస్వామ్యంలో కొన్ని పద్ధతులు, నియమాలు ఉంటాయని యువత గుర్తించాలని సూచించారు. యువత ఆలోచనా విధానాన్ని అర్థం చేసుకుంటూ వారితో నిరంతర సంభాషణ కొనసాగించడం అవసరమని మోహన్ భాగవత్ చెప్పారు. ఈ సమావేశానికి దేశవ్యాప్తంగా వందకు పైగా నగరాల నుంచి దాదాపు 2 వేల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు.

# ఆచార్య జయశంకర్ ఆశయాల సాధనకు కృషి చేద్దాం

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** మలి దశ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించి ప్రజలందరినీ ఏకతాటిపై తీసుకొచ్చి తెలంగాణ రాష్ట్ర సాధనలో పాలు పంచుకున్న ఆచార్య కొత్తపల్లి జయశంకర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసన సభ్యురాలు కోవ లక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్రే అనిల్, ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ ఆకాష్, వైస్ చైర్ పర్సన్ ఎండి. అహ్మద్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రతినిధి అలీబిన్ అహ్మద్, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మంగ లతో కలిసి హాజరై జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆచార్య జయశంకర్ మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొని తెలంగాణ రాష్ట్ర సాధనలో క్రియాశీలక పాత్ర పోషించి ప్రజలందరినీ ఏకతాటి పైకి తీసుకువచ్చిన మహనీయుడని అన్నారు. మహనీయుల ఆశయాల సాధనకు అందరం భాగస్వామ్యులు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి నదీమ్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసి భవన్ వద్ద పారిశుద్ధ్య పనులు

- పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండి అహ్మద్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఆదివాసి భవన్ వద్ద మున్సిపల్ ఆధ్వర్యంలో గురువారం విస్తృత పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండి అహ్మద్ లు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపాలిటీ తరపున చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారి రామయ్య, బీఆర్ఎస్ నాయకుడు సాయి శ్రవణ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాం తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంను గురువారం రోజున సాధారణ తనిఖీలు భాగంగా కలెక్టర్ కె. హరిత సందర్శించారు . ఈ సందర్భంగా గోదాంలో భద్రపరిచిన ఈవీఎంల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు , సీసీటీవీ నిఘా, అగ్నిమాపక పరికరాలు, ద్వంద్వ తాళాల వ్యవస్థ తదితర అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈవీఎంల భద్రతకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు అన్ని భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గోదాంలో నిర్వహిస్తున్న రికార్డులు, ప్రవేశ–నిష్క్రమణ వివరాలను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండలంలోని పీచర గ్రామ పంచాయతీ పరిధిలోగల తిమ్మాపూర్, లక్ష్మీపూర్ గ్రామాల్లో పెరుగుతున్న దోమలు, పిచ్చి గడ్డిని అరికట్టేందుకు గ్రామ సర్పంచ్ బైరి లింగవ్వ రాజేందర్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామాల్లో దోమల బెడదను నివారించేందుకు ప్రధాన వీధులు, మురుగు కాలువలతో పాటు నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో గురువారం ప్రత్యేకంగా దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. అలాగే, పరిసరాల పరిశుభ్రత కోసం పిచ్చి గడ్డి నివారణ మందును కూడా చల్లించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆడేం రాజేశ్వర్, మాజీ సర్పంచ్ సీతారాం పటేల్, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆడే పవన్ కుమార్, భీంరావ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా భద్రతే లక్ష్యంగా ట్రాఫిక్ పోలీసుల సేవలు



**ఉద్యమ కెరటం, హన్మకొండ:** ప్రజా భద్రతే లక్ష్యంగా ట్రాఫిక్ పోలీసులు సేవలు అందిస్తున్నారు. కాజిపేట్ చౌరస్తా, డీజిల్ కాలనీ, బాపూజీనగర్ సర్కిల్ పరిసరాల్లో రోడ్లపై ఏర్పడిన గుంతల కారణంగా తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించిన కాజిపేట్ ట్రాఫిక్ సీఐ పిట్టల వెంకన్న చొరవ తీసుకుని గుంతలను పూడ్చించే కార్యక్రమాన్ని చేపట్టారు. గురువారం ట్రాఫిక్ పోలీసు సిబ్బంది సహకారంతో రహదారులపై ఉన్న గుంతలను పూడ్చి వాహనదారులకు సురక్షిత ప్రయాణం కల్పించే చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గంధసిరి శ్రీకాంత్, మద్దెల కార్తీక్, తమ్మడి మధు, నల్లపు శివ, అంబటి మహేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొని తమ సహకారం అందించారు. ఈ సందర్భంగా స్థానికులు ట్రాఫిక్ పోలీసుల సేవలను అభినందించారు.

## జిల్లాలో ఉపాధ్యాయుల సర్దు బాటు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మార్మాట్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు (రేషనలైజేషన్) ప్రక్రియను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా, నిర్వహించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మార్మాట్ అధికారులతో అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియపై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ప్రతి పాఠశాలలో అవసరమైన మేరకు ఉపాధ్యాయుల కేటాయింపును చేపట్టాలని అన్నారు . సర్దుబాటు ప్రక్రియలో ప్రభుత్వ నిబంధనలు, సీనియారిటీ మరియు విద్యార్థుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి , జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్ , జిల్లాలోని 15 మండలాల మండల విద్యాధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మండల కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటు

**హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు**

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** ప్రజల భద్రత, నేరాల నియంత్రణే ధ్యేయంగా నేరడిగొండ మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సామాజిక కార్యకర్త సాబ్లే సంతోష్ సింగ్ విజ్ఞప్తి మేరకు.. మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లు , బస్టాండ్, మార్కెట్ ప్రాంతం, రద్దీ ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరగా, సర్పంచ్ ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డి, వీడీసీ చైర్మన్ ఏలేటి రవీందర్ రెడ్డి, ఉప సర్పంచ్ గోతి గులాబ్ సింగ్ లు వెంటనే స్పందించారు. పాలకవర్గంతో కలిసి తక్షణమే చర్యలు తీసుకుని ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ మండల కేంద్రంలో దొంగతనాలు, గొడవలు, చైన్ స్నాచింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడంలో ఇవి కీలకపాత్ర పోషిస్తాయన్నారు. అదేవిధంగా మహిళలు, విద్యార్థులు, వృద్ధులు మరింత సురక్షితంగా తిరిగేందుకు భరోసా కల్పిస్తాయని తెలిపారు. ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగినప్పుడు పోలీసుల దర్యాప్తునకు పక్కా వీడియో ఆధారాలు లభిస్తాయని పేర్కొన్నారు. వారసంతకు వేలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని, ఇక్కడ సీసీ కెమెరాలు ఉండటంతో దొంగతనాలు, చిన్నారులు తప్పిపోవడం వంటి ఘటనలను సమర్థవంతంగా నివారించవచ్చని చెప్పారు. ఈ భద్రత వాతావరణం ఏర్పడటం ద్వారా వ్యాపారులు, ప్రజలు ఎలాంటి ఆందోళన లేకుండా మరింత విశ్వాసంతో తమ పనులు చేసుకోగలుగుతారని



గ్రామస్తులు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ పాలకవర్గ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## జయశంకర్ ఆశయాల సాధనకు కృషి చేయడమే నిజమైన నివాళి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** తెలంగాణ భావజాల వ్యాప్తికర్త, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సిద్ధాంతకర్త ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాల సాధనకు కృషి చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆచార్య జయశంకర్ చిత్రపటానికి కలెక్టర్, అధికారులు, ప్రజా ప్రతినిధులు, వివిధ వర్గాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి ఆచార్య జయశంకర్ దిశానిర్దేశం చేశారని కొనియాడారు. స్వరాష్ట్ర సాధన కోసం జీవితాంతం కృషి చేస్తూ ప్రజల్లో, విద్యార్థుల్లో చైతన్యం నింపారని అన్నారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలు నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, జిల్లా సమగ్ర అభివృద్ధికి అంకితభావంతో పనిచేయడం ద్వారా ఆచార్య జయశంకర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని, అదే ఆయనకు అందించే నిజమైన నివాళి అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఆర్ఎస్.చిత్రు, డీఆర్ఓ స్రవంతి, ఏఓ వర్ణ, జిల్లా బీసీ సంక్షేమాధికారి డి.సోనియా, వివిధ సంఘాల నాయకులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



**ఉద్యమ కెరటం, తాండూర్:** ఈనెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని తొమ్మిది తెగల ఆదివాసీలు ఘనంగా నిర్వహించాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి మండిగ రవీందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గడ్డం మణికుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుర్సింగ బాపూరావు, మండల అధ్యక్షుడు యాపల సమ్మయ్య పిలుపునిచ్చారు. గురువారం తాండూర్ మండల కేంద్రంలోని ఐబీలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ప్రపంచ వ్యాప్తంగా ఆదివాసీల హక్కులు, సంస్కృతి, సాంప్రదాయాలు, స్వయం ప్రతిపత్తి, ఆత్మగౌరవాన్ని చాటిచెప్పే రోజుగా ప్రతి సంవత్సరం ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని తొమ్మిది తెగల ఆదివాసీలు కుల, ప్రాంత, రాజకీయ భేదాలకు అతీతంగా ఐక్యంగా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. ప్రతి గ్రామం, గూడెంలో ఆదివాసీ జెండాలు ఎగురవేయడం, మండల కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించి, కిష్టంపేటలోని కుమరంభీం విగ్రహం వద్ద ఆదివాసీ జెండాను ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఆదివాసీల రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణ, జల్ జంగల్ జమీన్పై హక్కులు, భాష, సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణ కోసం ప్రతి ఆదివాసీ ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ దినోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి ఆదివాసీ సంఘాలు, యువత, విద్యార్థులు, మహిళలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ కార్యదర్శి ఎలిగేటి రమేష్, మండల గౌరవ అధ్యక్షుడు అల్లంకొండ భీమయ్య, ప్రధాన కార్యదర్శి బుర్ర ప్రవీణ్, ఉపాధ్యక్షుడు గావుడే మల్లేష్, రేచిని సర్పంచ్ పోతరాజుల రాంబాయి, మాజీ సర్పంచ్ చింతపూరి దుర్గాబాయి, టేకం రాజేష్, ఊరేడి వెంకటేష్, రెబ్బెన అంజయ్య, తొమ్మిది తెగల ఆదివాసీ సంఘాల నాయకులు, యువకులు పాల్గొన్నారు.

# పార్కులో సౌకర్యాల కల్పనకు కృషి

## మున్సిపల్ చైర్మన్ మేంగ్రే ఆకాష్, వైస్ చైర్మన్ ఎండి అహ్మద్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** పట్టణంలోని చిల్డ్రన్స్ పార్కులో ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ మేంగ్రే ఆకాష్, వైస్ చైర్మన్ ఎండి అహ్మద్ తెలిపారు. గురువారం వారు చిల్డ్రన్స్ పార్కును ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పార్కులోని పరిశుభ్రతను, వసతులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. పార్కు ప్రాంగణం ఎల్లప్పుడూ అద్దంలా పరిశుభ్రంగా ఉండాలని, ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ కోసం వచ్చే పట్టణ ప్రజలకు, చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పరిశీలన సమయంలో పార్కులో ఉన్న వాకర్లతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను, సలహాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్కులో ఆధునిక ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని, అలాగే వాకింగ్ ట్రాక్‌ను మరింత పకడ్బందీగా పునర్నిర్మించాలని వాకర్స్ చైర్మన్, వైస్ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. వాకర్ల అభ్యర్థనపై స్పందించిన చైర్మన్ మేంగ్రే ఆకాష్, వైస్ చైర్మన్ ఎండి అహ్మద్ మాట్లాడుతూ "చిల్డ్రన్స్ పార్కు అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు మున్సిపాలిటీ నిరంతరం శ్రమిస్తోందని, పార్కు అభివృద్ధికై ఇప్పటికే నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులను ప్రారంభించడం జరుగుతుందన్నారు. వాకింగ్ ట్రాక్ తోపాటు పార్కులో ఉన్న చిన్నపాటి సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరిస్తాం అని వారు హామీ ఇచ్చారు.

# జయశంకర్ ఆశయాలే మాకు మార్గదర్శకం

## ఎమ్మెల్యే కోవ లక్ష్మి



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** తెలంగాణ సిద్ధాంతకర్త, ఆచార్య కొత్తపల్లి జయశంకర్ గారు కన్న కలలు, ఆయన చూపిన ఆశయాలే నేటి తెలంగాణ ప్రగతికి మార్గదర్శకమని ఆసిఫాబాద్ శాసనసభ్యురాలు కోవ లక్ష్మి స్పష్టం చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ 91వ జయంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో ఆమె అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి భావోద్వేగంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. 'నీళ్లు, నిధులు, నియామకాలు' అనే ఉద్యమ నినాదంతో యావత్ తెలంగాణ సమాజానికి దిశానిర్దేశం చేసిన పితామహుడు ఆయనేనని గుర్తుచేశారు. ఆయన బాటలో నడుస్తూ, ఆయన ఆశయాలను కొనసాగించడమే మనం ఇచ్చే నిజమైన శ్రద్ధాంజలి అని పేర్కొన్నారు. స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఉపాధి రంగాలలో విప్లవాత్మక మార్పులు సాధ్యమయ్యాయని తెలిపారు. జయశంకర్ సేవలు, సిద్ధాంతాలను స్ఫూర్తిగా తీసుకుని యువత సమాజ శ్రేయస్సు కోసం, ప్రాంతీయ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్, వైస్ చైర్మన్ అహ్మద్, సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, మున్సిపల్ కౌన్సిలర్ చిలువేరి వెంకన్న, బిఆర్ఎస్ పార్టీ నాయకులు మరుసుకోల సరస్వతి, నిస్సార్, సాంగ్డే జీవన్, సాయి శ్రవణ్, వినీష్, శైలేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా ప్రక్షాళనకు ప్రత్యేక చర్యలు



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** ఓటర్ల జాబితా ప్రక్షాళనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తహశీల్దార్ ఎంఎ కలీమ్ అన్నారు. మండల కేంద్రంలోని తహశీలార్ కార్యాలయంలో గురువారం బూత్ స్థాయి అధికారుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, తప్పుల తొలగింపు క్షేత్రస్థాయి పరిశీలన తదితర కీలక అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా అత్యంత పారదర్శకంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. ఇందులో భాగంగా గ్రామాల్లో మరణించిన, వలస వెళ్ళిన వారు, డబుల్ ఎంట్రీలను గుర్తించి ప్రత్యేక జాబితాను తయారు చేసి గ్రామ పంచాయతీ నోటీసు బోర్డులపై ప్రదర్శించాలని సూచించారు. గ్రామాల్లో నివసిస్తూ ఉండి కూడా పొరపాటున తొలగింపు జాబితాలో పేర్లు నమోదైతే, అలాంటి వారు వెంటనే అప్రమత్తమై 9వ తేదీ లోపు సంబంధిత దరఖాస్తు ఫారాన్ని నింపి అందజేయాలని కోరారు. అలాగే 2002, 2025 సంవత్సరాల ఓటర్ల జాబితాలలో పేర్లు, వివరాలు తప్పుగా ఉంటే, వాటిని బీఎల్ఓ యాప్ ద్వారా క్షుణ్ణంగా పరిశీలించి ఎప్పటికప్పుడు సరిదిద్దాలని బీఎల్ఓలను ఆదేశించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ సజావుగా సాగేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ విశ్వనాథ్, ఆర్ఐలు మమత, సాయిరాం, రెవెన్యూ సిబ్బంది, మండల పరిధిలోని వివిధ పోలింగ్ కేంద్రాల బీఎల్ఓలు పాల్గొన్నారు.

# మండల కాంగ్రెస్ కమిటీ సమీక్ష సమావేశం

## నూతన మండల కమిటీ ఎంపిక పూర్తి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం మండల కన్వీనర్ ఏలేటి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ కమిటీ కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతంలో భాగంగా 21 మంది సభ్యులతో కూడిన నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు కన్వీనర్ ఏలేటి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ నూతన కమిటీ జాబితాను త్వరలోనే డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్ కు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వారి ఆమోదం లభించిన వెంటనే నూతన మండల కమిటీ సభ్యుల పేర్లను అధికారికంగా ప్రకటిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ ఏలేటి రాజశేఖర్ రెడ్డితో పాటు నూతన మండల అధ్యక్షుడిగా ఎంపికైన నాయకుడిని వివిధ గ్రామాల నుంచి వచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏలేటి రాజశేఖర్ రెడ్డి మాట్లా డుతూ పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరూ చురుకైన పాత్ర పోషించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను, పార్టీ విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, నూతన కమిటీ సభ్యులు అత్యంత బాధ్యతాయుతంగా పనిచేసి పార్టీ అభివృద్ధికి అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మండలంలోని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. రాబోయే కాలంలో పార్టీ సంస్థాగత బలోపేతానికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# స్వయం సహాయక మహిళలకు ఉపాధి బాట

- వాంకిడిలో కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభం

**ఉద్యమ కెరటం, వాంకిడి:** స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించే లక్ష్యంతో వాంకిడి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఎంపీడీఓతో కలిసి గ్రామ పంచాయతీ సర్పంచ్ సతీష్ (సోను) ప్రారంభించారు. ఈ సందర్భంగా శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్లను పరిశీలించి, మహిళలతో మాట్లాడారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో పాటు ఆర్థికంగా స్వావలంబన సాధించాలని సూచించారు. అనంతరం శిక్షణ కేంద్రం నిర్వహణ, అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మహిళలకు నాణ్యమైన శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, సింగిల్ విండో చైర్మన్ జాబిరే పెంటయ్య, ఉప సర్పంచ్ దీపక్ ముండే, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# అంధకారంలో లక్ష్మీనగర్ కాలనీ

- వీధి దీపాలు వెలగక ప్రజల అవస్థలు



**ఉద్యమ కెరటం, వాంకిడి:** మండల కేంద్రంలోని లక్ష్మీనగర్ కాలనీలో గల 13, 14 వార్డుల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో కాలనీ మొత్తం అంధకారంలో మునిగిపోవడంతో పాములు, తేళ్లు వంటి విషసర్పాలు సంచరిస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీధిదీపాలు పనిచేయకపోవడంతో రాత్రి సమయంలో రాకపోకలు ప్రమాదకరంగా మారాయని, చిన్నారులు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాలనీవాసులు తెలిపారు. ఈ సమస్యపై గ్రామపంచాయతీ సిబ్బంది, సంబంధిత వార్డు సభ్యులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఎన్నికల సమయంలో కాలనీ అభివృద్ధికి హామీలు ఇచ్చిన ప్రజాప్రతినిధులు, గెలిచిన తర్వాత సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెడిపోయిన వీధిదీపాలను మరమ్మతు చేసి వెంటనే వెలిగేలా చర్యలు తీసుకోవాలని, ప్రజల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడకముందే సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరుతున్నారు.

# ఎఫ్టీ ఎల్ హద్దు లు తొలగించిన వారిపై పోలీసులకు ఫిర్యాదు



**ఉద్యమ కెరటం, సంగారెడ్డి:** హత్నూర మండలం ముచ్చర్ల గ్రామ శివారులోని నాగేటి కుంట ఎఫ్టీఎల్ (నీటి నిల్వ సామర్థ్యం) హద్దు బందులను తొలగించిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గురువారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఇరిగేషన్ ఏఈ శ్రీకాంత్ తెలిపారు. నాగేటి కుంట నీటి నిల్వ సామర్థ్యాన్ని సూచించే సరిహద్దు స్తంభాలను గతంలో ఏర్పాటు చేసినప్పటికీ, వాటిని కొందరు తొలగించినట్లు గుర్తించామని పేర్కొన్నారు. ఈ ఘటనపై లష్కర్లు శివయ్య, మాన్నయ్య క్షేత్రస్థాయిలో పరిశీలించి హద్దు రాళ్లు తొలగించిన విషయాన్ని నిర్ధారించారని చెప్పారు. ఈ మేరకు పోలీస్ స్టే షన్లోఫిర్యాదు చేయడంతో పాటు ఉన్నతాధికారులకు కూడా సమాచారం అందించినట్లు వివరించారు.

# ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ భద్రత కొనసాగించాలి



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్కు కల్పించిన బుల్లెట్ప్రూఫ్ వాహనం, గన్మెన్ భద్రతను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ గురువారం కాగజ్నగర్లోని తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద మహా ధర్నా నిర్వహించారు. సిర్పూర్ నియోజకవర్గానికి చెందిన నాయకులు, నాయకురాళ్లు, వివిధ మండలాల అధ్యక్షులు, డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న డాక్ట ర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్కు తగిన భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ఆయనకు ప్రస్తుతం ఉన్న బుల్లెట్ప్రూఫ్ వాహనం, గన్మెన్ భద్రతను యథాతథంగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా గోరింటాకు పండుగ




**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులు, విద్యార్థినులు 'గోరింటాకు పండుగ'ను ఘనంగా నిర్వహించారు. సాంప్రదాయాలను కాపాడుకోవడంతో పాటు మన సంస్కృతిని భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో ఈ వేడుకను ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి ప్రసాదించిన గోరింటాకు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. పండగలు, విశేష దినాల్లో గోరింటాకు పెట్టుకోవడం మన సాంప్రదాయమని విద్యార్థినులకు వివరించారు. ఈ వేడుకలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని తమ చేతులకు గోరింటాకును పెట్టుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు



**ఉద్యమ కెరటం, తాండూర్:** తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలను గురువారం తాండూర్ ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాండూర్ ఎంపీడీఓ శ్రీనివాస్ ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు సురం రవీందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గట్టు మురళీధర్ రావు, కాంగ్రెస్ పార్టీ తాండూర్ మండల ఉపాధ్యక్షులు షేక్ మోమిన్ అలీ, మాజీ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ పుట్ట శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ కటకాల మల్లేష్, పలువురు పంచాయతీ కార్యదర్శిలు, ఈఓలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్కు నివాళి

- ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ భద్రత పునరుద్ధరించాలని
- కాగజ్నగర్లో మహా ధర్నా



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ స్ఫూర్తిప్రదాత ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను కాగజ్నగర్ పట్టణంలో ఆర్ఎస్పీ అభిమానులు, బీఆర్ఎస్ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బహుజన ఆశాజ్యోతి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్కు భద్రతను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో మహా ధర్నా నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. బహుజనుల హక్కులు, తెలంగాణ ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్కు ప్రభుత్వం భద్రతను తగ్గించడం, తొలగించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయనకు కల్పించిన భద్రతను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించకపోతే రానున్న రోజుల్లో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ మహా ధర్నాలో ఆర్ఎస్పీ అభిమానులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బురద రోడ్లకు మోక్షం కల్పించిన సర్పంచ్ ఆడే శీల



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** మండల కేంద్రంలో బురద మయంగా మారిన అంతర్గత రహదారుల సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. వర్షాల కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజల కష్టాలను గుర్తించిన స్థానిక సర్పంచ్ ఆడే శీల ప్రత్యేక చొరవ తీసుకున్నారు. వార్డు మెంబర్ వసీం ఖాన్తో కలిసి గ్రామంలోని ప్రధాన బురద రోడ్లపై మొరం పోయించి, ప్రజల ఇబ్బందులను తక్షణమే తొలగించారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో గుడిహత్నూర్లోని పలు వీధులు నడవడానికి వీల్లేకుండా బురద కుంటలుగా మారాయి. దీంతో స్థానిక ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు, పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యపై తక్షణమే స్పందించిన సర్పంచ్ స్వయంగా రంగంలోకి దిగారు. వార్డు మెంబర్ వసీం ఖాన్ సహకారంతో అత్యవసరంగా గ్రావెల్ రప్పించి, రోడ్లను బాగు చేయించారు. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండే సర్పంచ్కు, ఆమెకు అండగా నిలిచిన వార్డు మెంబర్ వసీం ఖాన్కు స్థానికులు ప్రత్యేక కృతజ్ఞతలు

# జైల్ భరోను విజయవంతం చేయండి



**ఉద్యమ కెరటం, వాంకిడి:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 10న నిర్వహించనున్న దేశవ్యాప్త జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం దినాకర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని హమాలీ కార్యాలయం వద్ద గురువారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఐటీయూ, అఖిల భారత కిసాన్ సభ, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా జైల్ భరో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 335 గ్రామాలు, 15 మండల కేంద్రాలు, రెండు మున్సిపల్ కేంద్రాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్గా మార్చడంతో కార్మికుల హక్కులు దెబ్బతింటాయని పేర్కొన్నారు. లేబర్ కోడ్స్ అమలుతో పనిదినం పెరగడం, కనీస వేతనాల హక్కు బలహీనపడటం, స్కీం వర్కర్ల ఉద్యోగ భద్రతకు ముప్పు ఏర్పడటం, కార్మిక సంఘాల హక్కులు హరించబడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే జైల్ భరో కార్యక్రమంలో జిల్లాలోని కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సురేష్, పోసన్న, మధు, విలాస్, సంతోష్, ధర్మ తదితరులు పాల్గొన్నారు..

# తల్లిపాలే శిశువుకు తొలి సహజసిద్ధ టికా

- నవజాత శిశువులకు అన్నప్రాసన చేసిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా
- సిరికొండలో ఘనంగా తల్లి పాల వారోత్సవాలు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** శిశువు జన్మించిన తొలి గంటలోనే ఇచ్చే జున్ను పాలు బిడ్డకు తొలి సహజసిద్ధమైన టీకా వంటిదని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని సిరికొండ గ్రామంలో గురువారం నిర్వహించిన ప్రపంచ తల్లి పాల వారోత్సవాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవజాత శిశువుకు తల్లిపాలే అత్యుత్తమ ఆహారమని, ప్రసవమైన మొదటి గంటలోనే జున్ను పాలు తాగించడం ద్వారా అవసరమైన రోగనిరోధక శక్తి లభిస్తుందని తెలిపారు. తొలి ఆరు నెలల పాటు నీళ్లతో సహా ఎలాంటి ఇతర ఆహారం, డబ్బా పాలు ఇవ్వకుండా కేవలం తల్లిపాలనే అందించాలని సూచించారు. తల్లిపాలలో శిశువు శారీరక, మానసిక వికాసానికి అవసరమైన అన్ని పోషకాలు సమృద్ధిగా ఉంటాయని, తల్లిపాలు తాగే పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరిగి భవిష్యత్తులో అనేక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని పేర్కొన్నారు. తల్లిపాలు ఇచ్చే మహిళలకు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ల ముప్పు కూడా తగ్గుతుందని వివరించారు. శిశువుకు సరైన విధంగా పాలు అందించేందుకు తల్లి బిడ్డను సక్రమంగా పట్టుకోవడం అవసరమని తెలిపారు. తల్లులకు కుటుంబ సభ్యులు పూర్తి సహకారం అందించి, తగిన విశ్రాంతి, పోషకాహారం అందేలా చూడాలని కోరారు. అనంతరం తల్లిపాల వారోత్సవాల పోస్టర్ను ఆవిష్కరించి, అంగన్వాడీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్స్ను పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన పలువురు చిన్నారులకు కలెక్టర్ చేతుల మీదుగా అన్నప్రాసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి మిల్కా, గ్రామ సర్పంచ్ మాధవి కిషన్, ఆదిలాబాద్ రూరల్ మండల తహశీల్దార్ గోవింద్, సీడీపీఓ సౌందర్య, వైద్యాధికారిణి డాక్టర్ ఆశాకిరణ్, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఆచార్య జయశంకర్ ఆశయాలు చిరస్మరణీయం



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి వేడుకలను గురువారం సత్తుపల్లి ఏరియా జీఎం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్వీఆర్ ప్రహ్లాద్ ముఖ్య అతిథిగా హాజరై అధికారులు, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులతో కలిసి జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ పాత్ర ఎనలేనిదని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమానికి ఆయన అందించిన సిద్ధాంతపరమైన మార్గదర్శకత్వం, త్యాగం, అంకితభావం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం బొల్లం శ్రీనివాస్, కిష్టారం ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏఎల్ ఎన్వి సునీల్ వర్మ, ఏరియా ఇంజనీర్ కె.సోమశేఖరరావు, జేవీఆర్ ఓసీ ప్రాజెక్ట్ ఇంజనీర్ డి.శ్రీనివాసరావు, కిష్టారం ఓసీ ప్రాజెక్ట్ ఇంజనీర్ జి.వి.రావు, జేవియర్ డిస్పెన్సరీ డిప్యూటీ సీఎంఓ బి.నరసింహారావు, జేవీఆర్ ఓసీ ఎస్ఓఎం బి.రాజేశ్వరరావు, కిష్టారం ఓసీ బి.రామకృష్ణ, ఎస్సీ (సివిల్) ఎ.రవికుమార్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ వి.అభిలాష్, ఏరియా పర్చేజ్ ఆఫీసర్ ముక్కు మోహన్, ఎన్విరాన్మెంట్ ఆఫీసర్ టి.సత్యనారాయణ, ట్రెజరర్ సీఎంఓఏఐ ఎ.ప్రదీప్ కుమార్, వెల్ఫేర్ ఆఫీసర్ కె.శ్రీనివాస్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సుధాకర్, ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ బి.కోటేశ్వరరావు, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# సేంద్రియ పద్ధతులతో పంటల సంరక్షణ

- సేంద్రియ వ్యవసాయం, ఎఫ్ఎఫ్ఎస్ యాప్పై రైతులకు అవగాహన



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** సేంద్రియ పద్ధ తులతో పంటలను సంరక్షించుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి భగత్ రమేష్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని ముత్నూర్, థామస్గూడ గ్రామపంచాయతీల పరిధిలోని రైతులకు సేంద్రియ వ్యవసాయం, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎరువుల కొనుగోలు యాప్ (ఎఫ్ఎఫ్ఎస్)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంలో భాగంగా ఘన, ద్రవ జీవామృతం తయారీ విధానాన్ని రైతులకు వివరించారు. వీటి వినియోగంతో భూసారంతో పాటు పంటల దిగుబడి మెరుగుపడుతుందని తెలిపారు. అలాగే పంటలకు వచ్చే పురుగులు, తెగుళ్ల నివారణకు ఉపయోగపడే కషాయాలు, నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్నిఅస్త్రం వంటి సేంద్రియ ద్రావణాల ప్రాధాన్యతను వివరించారు. అనంతరం యాప్లో ఎరువుల కొనుగోలు గురించి అవగాహన కల్పించారు. ఆధార్ నంబర్ ఆధారంగా భూమి, పంట వివరాలను నమోదు చేసి యూరియా, డీఏపీ, ఎంఓపీ, కాంప్లెక్స్ ఎరువులను వివిధ ఫెర్టిలైజర్ డీలర్ల వద్ద బుక్ చేసుకుని సులభంగా పొందే అవకాశం ఈ యాప్ ద్వారా ఉందని పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి సందేహాలు ఉన్నా స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారి, మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు శృతి, వెంకటేష్, ముత్నూర్, థామస్గూడ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

**జంగం పాఠశాలలో బాలల గ్రామసభ**



**ఉద్యమ కెరటం, జైనూర్:** బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని సర్పంచ్ పెందూర్ అనసయా అర్జున్, ఉపసర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీ అన్నారు. మండలంలోని జంగం గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన బాలల గ్రామసభకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమై పాఠశాలలో ఉన్న సౌకర్యాలు, సమస్యలు, అవసరాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు నిర్భయంగా తమ అభిప్రాయాలు వెల్లడించాలని, గ్రామాభివృద్ధిలో పిల్లల సూచనలు కూడా ఎంతో విలువైనవని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రత, క్రమశిక్షణ, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పాఠశాలలో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు గ్రామ పంచాయతీ తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. విద్యాభివృద్ధి, పరిశుభ్రమైన పాఠశాల వాతావరణం కల్పించడం ప్రతిఒక్కరి బాధ్యత అని అన్నారు. గ్రామంలోని ప్రతి చిన్నారి ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రామకృష్ణ, వార్డు సభ్యులు కీర్తన్, భగవత్ రావు, రవి, రేవతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభకు తరలిన జనం



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో హైదరాబాద్లోని సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో గురువారం నిర్వహించిన సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభకు ఆదిలాబాద్ జిల్లా నుంచి భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. బోథ్ నియోజకవర్గ బాధ్యులు, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు ఆధ్వర్యంలో ఈ సభకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నలుమూలల నుంచి శ్రేణులు పెద్ద సంఖ్యలో కదలివచ్చాయి. సమాజంలో అన్ని వర్గాలకు తగిన సామాజిక న్యాయం జరగాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ సభలో బోథ్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా రాథోడ్ బాపూరావు మాట్లాడుతూ తెలంగాణలో సామాజిక న్యాయం సాధన కోసం అందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.




# ఖమ్మం గ్రీన్ఫీల్డ్ హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం



- తల్లి, కొడుకు దుర్మరణం
- ఇద్దరికి తీవ్ర గాయాలు

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా దేవరపల్లి గ్రీన్ఫీల్డ్ హైవేపై గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కారు, డీసీఎం వ్యాన్ ఎదురెదురుగా ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న తల్లి, కొడుకు ఘటన స్థలంలోనే మృతిచెందారు. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న వ్యక్తితో పాటు డీసీఎం వ్యాన్ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు కావడంతో అందులో ఇరుక్కుపోయిన తల్లి, కొడుకు మృతదేహాలను క్రేన్ సహాయంతో బయటకు తీశారు. మృతులు ఖమ్మం జిల్లా చింతకాని మండలం గాంధీనగర్కు చెందిన వారిగా గుర్తించారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మండలాల్లో 'సంఘటన్ శ్రీజన్ అభియాన్' సక్సెస్ చేయాలి

**• ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి**

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే లక్ష్యంతో చేపట్టిన 'సంఘటన్ శ్రీజన్ అభియాన్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్, గాదిగూడ మండలాల్లో గురువారం నిర్వహించిన విస్తృత స్థా యి సమావేశాల్లో పాల్గొని మాట్లాడారు. నూతన మండల కమిటీల ఏర్పాటులో ఎలాంటి వర్గ విభేదాలకు తావులేకుండా, అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం, పారదర్శకత ప్రాతిప దికగా కమిటీలను రూపొందించాలని స్పష్టం చేశారు. మండల, పీఏసీ కమిటీలను ఈనెల 7వ తేదీ వరకు, అలాగే మిగతా కమిటీల నియామక ప్రక్రియను 15వ తేదీ వరకు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. నూతనంగా ఏర్పాటయ్యే ప్రతి మండల కమిటీలో అధ్యక్షుడితో సహా మొత్తం 22 మంది సభ్యులు ఉంటారని తెలిపారు. వీటిలో ఇద్దరు ఉపాధ్యక్షులు, నలుగురు ప్రధాన కార్యదర్శులు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఉండేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. విశేషంగా పార్టీ కమిటీల్లో మహిళా నాయకులకు, కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని ఆదేశించారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి ఐక్యత, క్రమశిక్షణ, సమిష్టి కృషి తప్పనిసరని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షులు నరేష్



జాదవ్, ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ, మాజీ ఎంపీ సోయం బాపూరావు, డీసీసీ మాజీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవ్ రెడ్డి, పీఏసీ మెంబర్ ఏలేటి అశ్విన్ రెడ్డి, డీసీసీ కార్యవర్గ సభ్యులు, మాజీ టీటీడీ బోర్డ్ మెంబెర్ అనిల్, సిరికొండ మండల అధ్యక్షులు కంచం లక్ష్మణ్, గాదిగూడ మండల అధ్యక్షులు సీడం వామన్, స్థా నిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు, మాజీ జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలి

**• కేజీబీవీని తనిఖీ చేసిన ఎంఈఓ సునిత**



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** నూతన విద్యా విధానానికి అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధిస్తూ విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపర్చాలని మండల విద్యాధికారి సునిత అన్నారు. బెజ్జూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని గురువారం ఉప సర్పంచ్ రాచకొండ ఆదర్శ్తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. తరగతి గదులు, వంటశాల, డార్మిటరీ, డైనింగ్ హాల్తో పాటు నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం పాఠశాల రికార్డులను తనిఖీ చేసి, విద్యార్థు ల అభ్యాస సామర్థ్యాన్ని తరగతి గదుల్లో పరీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లోఅభ్యాస నైపుణ్యాలను పెంపొందించేలా బోధన కొనసాగించాలని తెలిపారు. ఉప సర్పంచ్ రాచకొండ ఆదర్శ్ మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు గ్రామపంచాయతీ సహకారం అందిస్తుందని చెప్పారు. పాఠశాల పరిసరాల పరిశుభ్రత, హరితవనం కార్యక్రమం నిర్వహణతో పాటు ఇతర సమస్యల పరిష్కారంలో గ్రామ పంచాయతీ సిబ్బంది భాగస్వామ్యం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి అరుణ, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల సాధికారతే గ్రామాభివృద్ధికి పునాది

**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** మహిళల సాధికారతే గ్రామాభివృద్ధికి పునాది అని సర్పంచ్ దుర్గం సరోజ తిరుపతి అన్నారు. మండల కేంద్రంలోని దివ్యజ్యోతి మండల సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహిళా గ్రామసభ నిర్వహించారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి ఆర్థి క స్వావలంబన, ఉపాధి అవకాశాల పెంపు, మహిళల అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి మహిళ ఆరోగ్యంగా ఉన్నప్పుడే గ్రామం ఆరోగ్యవంతంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. వర్షాకాలంలో పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. వేడి ఆహారం తీసుకోవడం, తాగునీటిని కాచి చల్లార్చి తాగడం, ఇంటి పరిసరాల్లో వర్షపు నీరు, మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాయితీ రుణాలు, ఆర్థిక సాధికారతకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వైకుంఠం, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ మోహన్ దాస్, ఐకేపీ సిబ్బంది, గ్రామ పంచాయతీ ప్రతినిధులు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా జయశంకర్ జయంతి వేడుకలు

**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను మండల కేంద్రంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రామ్మోహన్రావు, మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీడీఓ ప్రవీణ్కుమార్, మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఈఓ సునిత, బెజ్జూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ దుర్గం సరోజ తిరుపతి,



పంచాయతీ కార్యదర్శి వైకుంఠం ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆచార్య జయశంకర్ జీవితాంతం అవిశ్రాంతంగా కృషి చేశారని కొనియాడారు. తెలంగాణ ఉద్యమానికి ఆయన సిద్ధాంతపరమైన బలాన్ని అందించి, ప్రత్యేక రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. జయశంకర్ ఆశయాలను భావితరాలు కొనసాగించాలని, యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధి, హక్కుల సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# రోడ్డెక్కుతున్న పశువులు.. ప్రయాణికుల అవస్థ లు

**• అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం**

**ఉద్యమ కెరటం, కెరమెరి:** మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఆవుల గుంపులు నిత్యం సంచరిస్తుండటంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పట్టణ శివార్లలోని వంతెనపై, రహదారులపై ఆవులు గుంపులుగా ఉండటంతో ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమస్య నెలలుగా కొనసాగుతున్నప్పటికీ గ్రామపంచాయతీ అధికారులు, సంబంధిత శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. రహదారులపై వదిలే పశువులపై చర్యలు తీసుకుంటామని గతంలో ప్రకటించిన అధికారులు ప్రస్తుతం మౌనం వహిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో రహదారిపై సంచరించే ఆవులు స్పష్టంగా కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో రహదారులపై బురద, పశువుల వ్యర్థాలు పేరుకుపోవడం ద్వారా ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోందని పేర్కొన్నారు. పశువులను రోడ్లపై వదిలేయడంతోనే ఈ సమస్య తలెత్తుతోందని చెబుతున్నారు. వెంటనే రహదారులపై తిరుగుతున్న ఆవులను తొలగించి వాటి యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే రహదారిపై బైఠాయించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అధికారులు తక్షణమే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.



# జయశంకర్ స్ఫూర్తితో ముందుకు సాగాలి

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ స్ఫూర్తితో ప్రతిఒక్కరు ముందుకు సాగాలని మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు. జయశంకర్ జయంతి వేడుకలను గురువారం ఆదిలాబాద్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. అనంతరం ఉద్యమకారులు, కుల సంఘాల నాయకులతో కలిసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో, ప్రజల ఆత్మగౌరవ పరిరక్షణలో ప్రొఫెసర్ జయశంకర్ చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల త్యాగాలను ప్రభుత్వం ఎల్లప్పుడూ గుర్తిస్తుందని పేర్కొన్నారు. ప్రజలంతా ఐక్యంగా ఉంటూ బంగారు తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, తెలంగాణ ఉద్యమకారులు, వివిధ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థి నిల భద్రతకు పెద్ద పీట

**కేజీబీవీని తనిఖీ చేసిన వాంకిడి సర్పంచ్**



**ఉద్యమ కెరటం, వాంకిడి:** విద్యార్థినిల భద్రతకు పెద్దపీట వేయాలని వాంకిడి సర్పంచ్ సతీష్ అన్నారు. స్థానిక కేజీబీవీను గురువారం ఆకస్మికంగా సందర్శించి విద్యార్థినిలకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం నాణ్యత, వసతి గదులు, వంటశాల, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి నులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నాణ్యమైన సౌకర్యాలు కల్పించాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థినుల ఆరోగ్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ కార్యదర్శి శివకుమార్, సింగిల్ విండో చైర్మెన్ జాబిరే పెంటూ తదితరులు ఉన్నారు.

# బుద్ధ విహార్లో గద్ద ర్ వర్ధంతి వేడుకలు



**ఉద్యమ కెరటం, వాంకిడి,** తెలంగాణ ప్రజా యుద్ధనౌక గద్దర్ మూడో వర్ధంతిని మండలంలోని జేత్వాన్ బుద్ధ విహార్లో భారతీయ బౌద్ధ మహాసభ, అంబేద్కర్ సంఘం నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గద్ద ర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, రెండు నిమిషాల మౌనం పాటించి నివాళులు అర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ గద్దర్ తన పాటలు, ఆటల ద్వారా అణగారిన వర్గాల్లో చైతన్యం నింపి, సామాజిక మార్పు కోసం ప్రజలను ఉద్యమాల వైపు నడిపించారని కొనియాడారు. ఆయన కళ ప్రజల్లో ప్రశ్నించే ధైర్యాన్ని పెంపొందించిందని, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడిన మహోన్నత వ్యక్తిగా గద్దర్ చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అశోక్ మహుల్కర్, వర్ష వాస్ కమిటీ అధ్యక్షుడు దుర్గం శ్యాంరావు, సమత సైనిక్ దళ్ జిల్లా ఆర్గనైజర్ రోషన్ ఉప్రే, భారతీయ బౌద్ధ మహాసభ మండల అధ్యక్షుడు దుర్గం దుర్గాజీ, సమాజ అధ్యక్షుడు దుర్గం లహుజి శ్యాంరావు, రాజేశ్వర్ ఉప్రే, వర్ష వాస్ కమిటీ కార్యదర్శి దుర్గం దీపక్, అంబేద్కర్ సంఘం కోశాధికారి ఉప్రే నాగ్సేన్, నాయకులు విఠల్ చునార్కార్, దుర్గం శ్రీనివాస్, బౌద్ధ ఉపాసకులు పాండు జాడే, ఉప్రే ధర్మా, దుర్గం యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఉద్యమాలకు గద్ద రన్నేస్ఫూర్తి

**కాంగ్రెస్ ఎస్సీ విభాగం జిల్లా చైర్మన్ కె.పరమేశ్వర్**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:**
ప్రజా గాయకుడు, విప్లవ వీరుడు గద్దరన్న ప్రజా పోరాటాల స్ఫూర్తి ఎప్పటికీ అమరమని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ కె.పరమేశ్వర్ అన్నారు. గద్ద రన్న స్మారక దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. తన ఆట, పాటలతో దశాబ్దాల పాటు పీడిత ప్రజలను చైతన్య పర్చిన మహోన్నత వ్యక్తి గద్దరన్న అని కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలోనూ, అంతకుముందు ప్రజల పక్షాన ఆయన చేసిన పోరాటాలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. గద్దరన్న భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన పాడిన పాటలు, చూపిన విప్లవ మార్గం నిరంతరం సమాజానికి దిక్సూచిగా ఉంటాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజాస్వామ్య విలువలకు, ప్రజా గొంతుకలకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. గద్దరన్న ఆశయాల సాధన కోసం, సమాజంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల హక్కుల రక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని చెప్పారు. గద్దరన్న ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**

# భారత్-దక్షిణాఫ్రికా మహిళల సిరీస్ షెడ్యూల్‌లో మార్పులు



- మూడు టీ20లు అదనం.. పర్యటన మరో వారం పొడిగింపు
- ఛాంపియన్స్ ట్రోఫీ సన్నాహకంగా కొత్త సిరీస్

**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** భారత మహిళల క్రికెట్ జట్టు దక్షిణాఫ్రికా పర్యటన షెడ్యూల్‌లో క్రికెట్ సౌతాఫ్రికా కీలక మార్పులు చేసింది. ముందుగా ప్రకటించిన ఒక టెస్టు, మూడు వన్డే మ్యాచ్‌లతో పాటు తాజాగా మూడు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌ను కూడా చేర్చింది. దీంతో భారత జట్టు మరో వారం రోజుల పాటు దక్షిణాఫ్రికాలోనే పర్యటించనుంది. ముందుగా ఖరారైన షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 9 నుంచి 12 వరకు గెబెర్హాలో ఏకైక టెస్టు మ్యాచ్ జరగనుంది. అనంతరం డిసెంబర్ 16, 19, 22 తేదీల్లో పార్ల్, కేప్‌టౌన్, బ్లోమ్‌ఫోంటెన్ వేదికలుగా మూడు వన్డేలు నిర్వహించనున్నారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 26, 28, 30 తేదీల్లో బెనోని, పోచెఫ్‌స్ట్రూమ్ వేదికలుగా మూడు టీ20 మ్యాచ్‌లు ఆడనున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో శ్రీలంక వేదికగా జరిగే తొలి ఐసీసీ మహిళల ఛాంపియన్స్ ట్రోఫీకి ఈ టీ20 సిరీస్ చక్కటి సన్నాహకంగా ఉపయోగపడుతుందని క్రికెట్ సౌతాఫ్రికా పేర్కొంది. ప్రపంచంలోనే బలమైన జట్లలో ఒకటైన భారత జట్టుతో మూడు ఫార్మాట్లలో పోటీపడటం తమ ఆటగాళ్లకు విలువైన అనుభవాన్ని అందిస్తుందని క్రికెట్ సౌతాఫ్రికా సీఈఓ ఫోలెట్సీ మోసెకి తెలిపారు. ఇటీవలి రికార్డుల ప్రకారం, ఈ ఏడాది మార్చి-ఏప్రిల్‌లో జరిగిన టీ20 సిరీస్‌లో దక్షిణాఫ్రికా 4-1 తేడాతో భారత్‌ను ఓడించింది. అనంతరం ఇంగ్లాండ్‌లో జరిగిన మహిళల టీ20 ప్రపంచకప్‌లోనూ దక్షిణాఫ్రికా చేతిలో ఓడిన భారత్ సెమీఫైనల్ అవకాశాలను కోల్పోయింది. ఇప్పుడు జరిగే కొత్త టీ20 సిరీస్ ఆ పరాజయాలకు ప్రతీకారం తీర్చుకునే అవకాశంగా భావిస్తున్నారు.



# ఆసియా కప్ షెడ్యూల్ విడుదల

## సెప్టెంబర్ 5న భారత్-పాకిస్థాన్ హైఓల్టేజ్ పోరు

## ఆగస్టు 28 నుంచి దుబాయ్ వేదికగా మహిళల ఆసియా కప్

**దుబాయ్, ఆగస్టు 6:** క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న మహిళల ఆసియా కప్ షెడ్యూల్‌ను ఆసియా క్రికెట్ మండలి (ఏసీసీ) విడుదల చేసింది. దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికగా ఆగస్టు 28 నుంచి ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీ ప్రారంభం కానుంది. ఇందులో అందరి దృష్టిని ఆకర్షిస్తున్న భారత్-పాకిస్థాన్ మ్యాచ్ సెప్టెంబర్ 5న జరగనుంది. ఇటీవల మహిళల వన్డే ప్రపంచకప్‌లో తలపడిన భారత్, పాకిస్థాన్ జట్లు మరోసారి ఆసియా కప్ వేదికగా అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఈ మ్యాచ్‌పై ఇప్పటికే అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. మహిళల ఆసియా కప్‌లో ఆసియా ఖండానికి చెందిన అగ్ర జట్లు టైటిల్ కోసం పోటీపడనున్నాయి. టోర్నీని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆసియా క్రికెట్ మండలి తెలిపింది. భారత్‌తో పాటు పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ తదితర జట్లు ఈ మెగా టోర్నీలో పాల్గొననున్నాయి. భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌కు ప్రపంచవ్యాప్తంగా భారీ ఆదరణ లభించే అవకాశం ఉందని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ పోరు టోర్నీలోనే అత్యంత కీలక ఆకర్షణగా నిలవనుంది.

# 'నాలో ఇంకా సత్తా తగ్గలేదు'

## జట్టులోకి రీఎంట్రీ లక్ష్యంగా షమీ తీవ్ర సాధన

## ఐదు కిలోలు బరువు తగ్గిన స్టార్ పేసర్

## సెలక్టర్లకు పరోక్ష హెచ్చరిక.. మళ్లీ టీమిండియాలో చోటే లక్ష్యం

**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** భారత సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ జాతీయ జట్టులోకి పునరాగమనమే లక్ష్యంగా కఠోరంగా శ్రమిస్తున్నాడు. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత భారత జట్టుకు దూరమైన షమీ, తనలో ఇంకా ఎంతో క్రికెట్ మిగిలి ఉందని నిరూపించేందుకు సిద్ధమయ్యాడు. దేశవాళీ క్రికెట్‌లో వరుసగా అద్భుత ప్రదర్శనలు చేసినప్పటికీ సెలక్టర్లు అవకాశమివ్వకపోవడంతో ఇప్పుడు తన ఫిట్‌నెస్, ఫామ్‌తోనే సమాధానం చెప్పాలని భావిస్తున్నాడు. 2023 వన్డే ప్రపంచకప్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచిన షమీ, గత రంజీ ట్రోఫీలో 7 మ్యాచ్‌ల్లో 37 వికెట్లు, విజయ్ హజారే ట్రోఫీలో 7 మ్యాచ్‌ల్లో 15 వికెట్లు తీసి తన పదును ఏమాత్రం తగ్గలేదని చాటాడు. అయినప్పటికీ జాతీయ జట్టులో అవకాశం రాకపోవడంతో రీఎంట్రీ కోసం మరింత పట్టుదలతో సాధన కొనసాగిస్తున్నాడు. షమీ బాల్య కోచ్ మహమ్మద్ బద్రుద్దీన్ మాట్లాడుతూ, రాబోయే సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని షమీ ఐదు కిలోల బరువు తగ్గాడని తెలిపారు. అతను శారీరకంగానే కాదు, మానసికంగానూ ఎంతో దృఢంగా ఉన్నాడని, దేశానికి అవసరమైతే మళ్లీ అత్యుత్తమ స్థాయిలో ఆడేందుకు సిద్ధంగా ఉన్నాడని చెప్పారు. ఇటీవల ఇంగ్లాండ్ పర్యటనలో భారత పేస్ దాడి ఆశించిన స్థాయిలో రాణించలేదని, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ గాయాలు, ఇతర బౌలర్ల అనుభవలేమి జట్టును ప్రభావితం చేశాయని బద్రుద్దీన్ అభిప్రాయపడ్డారు. అలాంటి పరిస్థితుల్లో షమీ అనుభవం జట్టుకు ఎంతో ఉపయోగపడేదని పేర్కొన్నారు. 2027 దక్షిణాఫ్రికా వన్డే ప్రపంచకప్‌లో కూడా అతని అనుభవం భారత్‌కు కీలకమవుతుందని చెప్పారు. ఇదిలా ఉండగా, అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అజింక్య రహానేకు షమీ సోషల్ మీడియా ద్వారా అభినందనలు తెలిపాడు. రహానే క్రమశిక్షణ, అంకితభావం, జట్టుకు అందించిన సేవలు ఎన్నో తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని కొనియాడాడు. ఇదే సమయంలో షమీని మళ్లీ భారత జట్టులోకి తీసుకోవాలనే డిమాండ్ అభిమానులు, మాజీ క్రికెటర్ల నుంచి కూడా బలంగా వినిపిస్తోంది.






# వన్డే ప్రపంచకప్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభం

## 2027 క్వాలిఫయర్ షెడ్యూల్ విడుదల చేసిన ఐసీసీ

## ఫిబ్రవరి 22 నుంచి మార్చి 23 వరకు అర్హత పోటీలు

## వెస్టిండీస్‌కు మరోసారి క్వాలిఫయర్స్ గండం

**దుబాయ్, ఆగస్టు 6:** ప్రతిష్ఠాత్మక 2027 ఐసీసీ వన్డే ప్రపంచకప్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఈ మెగా టోర్నీకి అర్హత సాధించే జట్ల కోసం నిర్వహించే క్వాలిఫయర్ టోర్నీ షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రకటించింది. 2027 ప్రపంచకప్ క్వాలిఫయర్ పోటీలు వచ్చే ఏడాది ఫిబ్రవరి 22 నుంచి మార్చి 23 వరకు జరగనున్నాయి. అయితే ఈ టోర్నీకి ఆతిథ్యమిచ్చే వేదికను ఇంకా ఖరారు చేయలేదు. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా నిర్వహించనున్న 2027 వన్డే ప్రపంచకప్ అక్టోబర్ 4 నుంచి నవంబర్ 21 వరకు 12 వేదికల్లో జరగనుంది. కొత్త ఫార్మాట్ ప్రకారం క్వాలిఫయర్ టోర్నీలో 10 జట్లు పోటీపడతాయి. ఇందులో విజేతగా నిలిచిన జట్టు నేరుగా ప్రపంచకప్ ప్రధాన దశకు అర్హత సాధిస్తుంది. రెండు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్ సిరీస్ తొలి దశలో తలపడతాయి. ఆ పోటీల్లో అగ్రస్థానంలో నిలిచే జట్టుకు ప్రపంచకప్‌లో మరో బెర్త్ దక్కుతుంది. క్వాలిఫయర్‌లో పాల్గొనే 10 జట్ల ఎంపిక కూడా ఆసక్తికరంగా ఉండనుంది. 2026 సెప్టెంబర్ 30 నాటికి ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో ఆతిథ్య దేశాలైన దక్షిణాఫ్రికా, జింబాబ్వే మినహా అత్యల్ప ర్యాంక్‌లో ఉన్న ఇద్దరు పూర్తి సభ్య దేశాలు క్వాలిఫయర్స్ ఆడాల్సి ఉంటుంది. వీటితో పాటు వరల్డ్ కప్ లీగ్-2లో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు, క్వాలిఫయర్ ప్లేఆఫ్స్ నుంచి అర్హత సాధించిన మరో నాలుగు జట్లు పోటీలోకి వస్తాయి. ప్లేఆఫ్స్‌లో లీగ్-2లో చివరి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు, ఛాలెంజ్ లీగ్ నుంచి వచ్చిన నాలుగు జట్లు తలపడతాయి. ఛాలెంజ్ లీగ్‌లో 12 జట్లను రెండు గ్రూపులుగా విభజించి లీగ్ దశ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. మాజీ ప్రపంచ ఛాంపియన్ వెస్టిండీస్‌కు ఈసారి కూడా క్వాలిఫికేషన్ సవాలుగా మారింది. ప్రస్తుతం ఐసీసీ ర్యాంకింగ్స్‌లో 10వ స్థానంలో ఉన్న విండీస్, సెప్టెంబర్ కట్‌ఆఫ్‌కు ముందు భారత్‌తో రెండు వన్డేలు మాత్రమే ఆడనుంది. అఫ్గానిస్థాన్--ఐర్లాండ్ సిరీస్ ఫలితాలు కూడా వెస్టిండీస్ భవితవ్యాన్ని ప్రభావితం చేయనున్నాయి. ఐర్లాండ్ భారీ తేడాతో సిరీస్ గెలిచి, వెస్టిండీస్ భారత్‌పై రెండు విజయాలు సాధిస్తేనే టాప్-8లోకి చేరే అవకాశం ఉంటుంది. లేనిపక్షంలో 2023లో మాదిరిగానే మరోసారి ప్రపంచకప్ అర్హత కోసం క్వాలిఫయర్స్ ఆడాల్సిన పరిస్థితి ఏర్పడనుంది.



# నెట్స్‌లో గాయపడిన గిల్

## బొటనవేలికి బంతి తాకడంతో అభిమానుల్లో ఆందోళన

## చికిత్స అనంతరం మళ్లీ బ్యాటింగ్.. శ్రీలంక టెస్టుకు సిద్ధమే

**కొలంబో, ఆగస్టు 6:** శ్రీలంకతో జరిగే టెస్టు సిరీస్‌కు ముందు భారత జట్టుకు మరో గాయాల భయం పట్టుకుంది. నెట్స్‌లో సాధన చేస్తున్న సందర్భంగా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బొటనవేలికి బంతి బలంగా తగలడంతో కాసేపు మైదానంలో నొప్పితో విలవిల్లాడాడు. అయితే వెంటనే వైద్య బృందం చికిత్స అందించగా, కొద్దిసేపటి తర్వాత గిల్ మళ్లీ బ్యాటింగ్ సాధన కొనసాగించడం జట్టు యాజమాన్యానికి ఊరటనిచ్చింది. దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత శ్రీలంక గడ్డపై టెస్టు సిరీస్ ఆడనున్న భారత జట్టు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే ఏకైక వార్మప్ మ్యాచ్‌కు సిద్ధమవుతోంది. 2017లో చివరిసారిగా శ్రీలంకలో టెస్టు ఆడిన భారత జట్టులో ప్రస్తుతం లోకేష్ రాహుల్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్‌లకు మాత్రమే అక్కడ ఆడిన అనుభవం ఉంది. ఇప్పటికే స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా గాయం కారణంగా టెస్టు సిరీస్ మొత్తానికి దూరమవగా, అతని స్థానంలో ఆకిబ్ నబీని ఎంపిక చేశారు. మరో ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ కూడా తొడ కండరాల గాయంతో తొలి టెస్టుకు అందుబాటులో ఉండటం లేదు. దీంతో భారత పేస్ దాడికి మహమ్మద్ సిరాజ్ నాయకత్వం వహించనున్నాడు. అతనికి ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, మానవ్ సుథార్, సారాంశ్ జైన్ సహకరించనున్నారు. ఇటీవల ఇంగ్లాండ్ పర్యటనలో కూడా తొడ కండరాల సమస్యతో ఇబ్బంది పడిన గిల్ పూర్తిస్థాయి ఫిట్‌నెస్ సాధించాలని జట్టు యాజమాన్యం భావిస్తోంది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని కెప్టెన్ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఇక వార్మప్ మ్యాచ్ కోసం శ్రీలంక బోర్డు సోనల్ దినుషా నాయకత్వంలో బలమైన జట్టును ప్రకటించింది. లహిరు కుమార, విశ్వ ఫెర్నాండో, రమేష్ మెండిస్ వంటి అనుభవజ్ఞులు ఇందులో చోటు దక్కించుకున్నారు. స్థానిక పరిస్థితులకు అలవాటు పడేందుకు ఈ వార్మప్ మ్యాచ్ భారత జట్టుకు కీలకంగా మారనుంది.

# 'మన హద్దులు దాటాలి'

## శ్రీలంక టెస్టు సిరీస్‌కు ముందు టీమిండియాకు గంభీర్ హెచ్చరిక

## ప్రతి సవాల్‌కు సిద్ధంగా ఉండాలన్న హెడ్ కోచ్



**కొలంబో, ఆగస్టు 6:** శ్రీలంకతో జరగనున్న కీలక టెస్టు సిరీస్‌కు ముందు భారత జట్టుకు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ గట్టి సందేశం ఇచ్చాడు. ప్రతి ఆటగాడు తన హద్దులను దాటి మరింత కష్టపడాలని, మానసికంగా, శారీరకంగా పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని సూచించాడు. ఆగస్టు 15 నుంచి ప్రారంభమయ్యే రెండు టెస్టుల సిరీస్‌ను దృష్టిలో ఉంచుకుని జట్టు ప్రస్తుతం కొలంబోలో ముమ్మర సాధన కొనసాగిస్తోంది. బీసీసీఐ టీవీతో మాట్లాడిన గంభీర్, "మన ముందున్న సవాలు ఏమిటో అందరికీ తెలుసు. గతంలో కంటే ఎక్కువగా శ్రమించాలి. తొలి రోజు నుంచే బ్యాటింగ్ అయినా, బౌలింగ్ అయినా ప్రత్యర్థి విసిరే ప్రతి సవాల్‌కు మన దగ్గర సమాధానం ఉండాలి. అందుకే ఇప్పటి నుంచే అన్ని అంశాల్లో సిద్ధంగా ఉండాలి" అని ఆటగాళ్లకు పిలుపునిచ్చాడు. ఆగస్టు 7 నుంచి 9 వరకు కొలంబోలో మూడు రోజుల వార్మప్ మ్యాచ్ ఆడనున్న భారత జట్టు, అనంతరం గాలేకు చేరుకుని ఆగస్టు 15న తొలి టెస్టులో శ్రీలంకను ఎదుర్కొంటుంది. ఈ సందర్భంగా భారత టెస్టు జట్టులో కొత్తగా చోటు దక్కించుకున్న ఆఫ్‌స్పిన్ ఆల్‌రౌండర్ సారాంశ్ జైన్, యువ పేసర్ ఆకిబ్ నబీకి గంభీర్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపాడు. కొత్త ఫీల్డింగ్ కోచ్ శుభదీప్ ఘోష్‌కు కూడా జట్టులోకి స్వాగతం పలుకుతూ, ఆయన అనుభవం జట్టుకు ఎంతో ఉపయోగపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశాడు. ప్రస్తుతం ఐసీసీ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (2025-27) పాయింట్ల పట్టికలో భారత్ 48.15 శాతం పాయింట్లతో ఐదో స్థానంలో ఉండగా, శ్రీలంక 41.67 శాతం పాయింట్లతో ఆరో స్థానంలో ఉంది. దీంతో ఈ సిరీస్ ఇరు జట్లకు అత్యంత కీలకంగా మారింది. శ్రీలంకలో స్పిన్‌కు అనుకూలించే పిచ్‌లు, స్వదేశీ పరిస్థితులు భారత్‌కు సవాల్‌గా మారే అవకాశం ఉంది. డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో బలంగా నిలవాలంటే ఈ సిరీస్‌లో విజయమే లక్ష్యంగా టీమిండియా బరిలోకి దిగనుంది. గంభీర్ సందేశం జట్టులో మరింత పోరాటస్ఫూర్తిని నింపేలా ఉందని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి.



# 'కింగ్ జాకీ క్వీన్' వెనుక ఆసక్తికర కథ

## అనుష్క కోసం 12 ఏళ్ల క్రితమే సిద్ధమైన స్క్రిప్ట్‌గా ప్రచారం

## సందీప్ రెడ్డి వంగా వ్యాఖ్యలతో సినిమాపై పెరిగిన ఆసక్తి

**హైదరాబాద్, ఆగస్టు 6:** ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానున్న తెలుగు చిత్రం 'కింగ్ జాకీ క్వీన్' విడుదలకు ముందే ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించగా, తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికర విషయం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దీక్షిత్ శెట్టి, శశి ఓదెల, యుక్తి తరేజా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ పీరియాడిక్ క్రైమ్ డ్రామాను ఎస్‌ఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మించారు. ప్రముఖ దర్శకుడు కిరణ్ కుమార్ దర్శకత్వం వహించిన చివరి చిత్రం ఇదే కావడం ఈ సినిమాకు మరో ప్రత్యేకత. సినిమా ప్రమోషన్ కార్యక్రమంలో పాల్గొన్న దర్శకుడు సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ, ఈ కథను దర్శకుడు కిరణ్ కుమార్ దాదాపు 12 ఏళ్ల క్రితమే సిద్ధం చేశారని వెల్లడించారు. అప్పట్లో ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కించాలని భావించిన ఆయన, కథానాయిక పాత్రను స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి కోసం ప్రత్యేకంగా రూపొందించారని తెలిపారు. అయితే అనివార్య కారణాలతో ఆ ప్రాజెక్టు అప్పట్లో కార్యరూపం దాల్చలేదన్నారు. అయినా కథను పక్కన పెట్టకుండా కాలానికి అనుగుణంగా మార్పులు చేస్తూ మరింత బలోపేతం చేసిన కిరణ్ కుమార్, చివరకు దానిని 'కింగ్ జాకీ క్వీన్' రూపంలో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారని చెప్పారు. తొలుత అనుష్క కోసం రాసిన పాత్రే ప్రస్తుతం యుక్తి తరేజా పోషిస్తున్న పాత్రగా రూపాంతరం చెందిందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రంతో మరో విశేషం కూడా ఉంది. ప్రముఖ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సోదరుడు శశి ఓదెల హీరోగా పరిచయం అవుతుండగా, తొలి చిత్రానికే పీరియాడిక్ క్రైమ్ డ్రామా వంటి భిన్న కథను ఎంచుకోవడం విశేషంగా మారింది. దీక్షిత్ శెట్టి కీలక పాత్రలో నటిస్తుండగా, చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు పూర్ణచంద్ర తేజస్వి సంగీతం సమకూర్చారు. విడుదలకు ముందే ప్రచారంలో నిలిచిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితాన్ని సాధిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.




# నాన్-లోకల్ ముద్ర వేస్తే ఊరుకోను




- కొమురం భీమ్ మట్టి బిడ్డ గళాన్ని ఆపలేరు
- గాంధీభవన్ వేదికగా 'స్వార్థ' నాటకాలు
- డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో కొంతమంది నాయకులు వ్యక్తిగత స్వార్థం, పదవుల రాజకీయాల కోసం కావాలనే వర్గ విభేదాలను రెచ్చగొడుతూ పార్టీని బలహీనపరిచే కుట్ర చేస్తున్నారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గురువారం ముఖ్య నాయకులు, కార్యకర్తలతో డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. మాజీ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు కలిసి కొంతమంది కార్యకర్తలను ప్రలోభాలకు గురిచేసి, అభివృద్ధి పనులు ఇప్పిస్తామంటూ హైదరాబాద్ గాంధీభవన్‌కు తీసుకెళ్లి తనపై ఆరోపణలు చేయించారని ఆమె విమర్శించారు. ఇది కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే కార్యక్రమం కాదని, కొందరు నాయకులు కలిసి ఆడుతున్న రాజకీయ నాటకమని ధ్వజమెత్తారు. నన్ను నాన్-లోకల్ అంటున్న వారు ముందుగా ఈ నేల చరిత్ర తెలుసుకోవాలని హితవు పలికారు. నేను కొమురంభీమ్ గడ్డపై పుట్టి పెరిగిన ఆదివాసి బిడ్డనని, సిర్పూర్-యూ మండలం పుల్లార గ్రామంలో జన్మించి ఈ జిల్లా మట్టి వాసనతో పెరిగిన వ్యక్తినని పేర్కొన్నారు. ఈ నేలపై తనకు ఉన్న హక్కును ప్రశ్నించే నైతిక హక్కు ఎవరికీ లేదన్నారు. ఆదివాసి బిడ్డను నాన్-లోకల్‌గా చిత్రీకరించడం జిల్లా ప్రజలను, ఆదివాసీ సమాజాన్ని అవమానించడమేనని స్పష్టం చేశారు. తాను 1995లోనే కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీటీసీగా గెలిచానని, అప్పటి నుంచి పార్టీ మారలేదని గుర్తుచేశారు. ఉపాధ్యాయ వృత్తి చేసుకుంటున్న సమయంలో పార్టీ ఎంపీ టికెట్ ఇచ్చిందని, అనంతరం తన పనితీరు, పార్టీ పట్ల నిబద్ధతను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానమే తనకు టీపీసీసీ ఉపాధ్యక్షురాలిగా, డీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు అప్పగించిందని తెలిపారు. ఆ నిర్ణయాన్ని కొంతమంది సొంత లాభం కోసం వీధుల్లో నిలబడి ప్రశ్నించడం అంటే నేరుగా అధిష్ఠానాన్నే సవాల్ చేయడమేనని అన్నారు. పదవులు రాకపోవడంతో అసంతృప్తిని పార్టీపైకి మళ్లిస్తూ, కార్యకర్తలను రెచ్చగొట్టి కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రజల మధ్య పార్టీని బలోపేతం చేయాల్సిన నాయకులే బలహీనపరిచే కార్యక్రమాలు చేపట్టడం అత్యంత దురదృష్టకరమన్నారు. తాను ఎవరిపైనా కక్షతో రాజకీయాలు చేయనని, కానీ పార్టీ క్రమశిక్షణను దెబ్బతీసే చర్యలను మాత్రం సహించబోనని స్పష్టం చేశారు. పార్టీని బలోపేతం చేయకుండా వ్యక్తిగత రాజకీయాల కోసం గాంధీభవన్‌ను వేదికగా మార్చిన వారు కార్యకర్తలకు సమాధానం చెప్పాల్సిన రోజు తప్పకుండా వస్తుందన్నారు. పార్టీని ధిక్కరించి అధిష్ఠానం నిర్ణయాలను బహిరంగంగా వ్యతిరేకిస్తున్న వారిపై అధిష్ఠానం తగిన సమయంలో తగిన నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. జిల్లా కాంగ్రెస్ కార్యకర్తలు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా పార్టీ జెండా కింద ఐక్యంగా నిలబడి కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని సుగుణక్క పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మంగ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా, కాంగ్రెస్ మండల అధ్యక్షులు రాపర్తి మురళి, టౌన్ అధ్యక్షుడు మీర్ ఇమ్రాన్ హష్మీ, కాంగ్రెస్ వివిధ మండలాల అధ్యక్షులు సుజియత్, రషీద్, కిషన్ గౌడు, గణపతి, మెంగజీ, జిల్లా కార్యవర్గ సభ్యులు గాదవేణి మల్లేష్, తారీక్, కట్కర్ భీమ్రావు, శోభన్, చిరంజీవి, ప్రకాష్, బాదు పటేల్, శంకర్, పంచాయతీరాజ్ సంఘటన జిల్లా కో-ఆర్డినేటర్ కోవ ఇందిరా, ఆత్మ చైర్మన్ గడ్డల సత్తయ్య, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు కమల్ నాథ్ రెడ్డి, నాంపల్లి శంకర్, డీసీసీ కార్యవర్గ సభ్యులు, వివిధ సంస్థల చైర్మన్లు, అనుబంధ సంఘాల నాయకులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# చకచకా రాకా మూవీ షూటింగ్

## మెటర్నిటీ బ్రేక్‌లో దీపికా పడుకొణె



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పడుకొణె ప్రస్తుతం మాతృత్వాన్ని ఆస్వాదిస్తూ కుటుంబంతో సమయం గడుపుతున్నారు. అయితే ఆమె మెటర్నటీ బ్రేక్ కారణంగా అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'రాకా' షూటింగ్‌కు ఆటంకం ఏర్పడుతుందనే ప్రచారం జరుగుతున్న వేళ, చిత్రబృందం అందుకు పూర్తి భిన్నంగా ముందుకు సాగుతున్నట్లు సమాచారం. సినీ వర్గాల సమాచారం ప్రకారం, దీపికా మెటర్నటీ బ్రేక్‌ను ముందుగానే దృష్టిలో పెట్టుకుని చిత్రబృందం షూటింగ్ షెడ్యూల్‌ను ఎంతో కచ్చితంగా ఎ÷-లాన్ చేసింది. ఆమె అందుబాటులో ఉన్న సమయంలోనే ఎక్కువ భాగం సన్నివేశాలను పూర్తి చేయడంతో ప్రస్తుతం షూటింగ్ ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగుతోంది. దీపికా విరామంలో ఉన్న రోజుల్లో ఇతర ప్రధాన నటీనటులతో చిత్రీకరణ నిర్వహిస్తూ ఒక్క రోజు కూడా వృథా కాకుండా మేకర్స్ జాగ్రత్తలు తీసుకున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం దీపికా పదుకొణెకు సంబంధించిన షూటింగ్ దాదాపు పూర్తయినట్లు సమాచారం. చిన్న సన్నివేశాలు మాత్రమే ఉండగా, వాటిని తర్వాతి దశలో చిత్రీకరించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఆమె వ్యక్తిగత జీవితానికి, సినిమా నిర్మాణానికి మధ్య ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మేకర్స్ పక్కా ప్లానింగ్ చేసినట్లు తెలుస్తోంది. 'రాకా' సినిమాలో దీపికా పదుకొణె పాత్ర కథకు అత్యంత కీలకమని సమాచారం. ఆమె పాత్ర చుట్టూనే కథలో ప్రధాన మలుపులు తిరుగుతాయని టాక్ వినిపిస్తోంది. అందుకే షూటింగ్ ప్రారంభ దశలోనే ఆమె సన్నివేశాలకు ప్రాధాన్యం ఇచ్చి పూర్తి చేసినట్లు తెలుస్తోంది. భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'రాకా' ఒకటిగా నిలిచింది. భారీ తారాగణం, హై టెక్నికల్ స్టాండర్డ్స్, భారీ బ్జడెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. షూటింగ్ అనుకున్న షెడ్యూల్ ప్రకారమే కొనసాగుతుండటంతో, సినిమా విడుదల కూడా నిర్ణయించిన సమయానికే జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**